
ఆంధ్రజ్యోతి



కర్నూలు
జిల్లా వార్తలు 5
శుక్రవారం 2 మే 2025

రెపరెపలాడిన కార్మిక పతాకం

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా మేడే వేడుకలు
- కేంద్ర విధానాలపై పోరాడాలి
- మాజీ ఎమ్మెల్యే గఫూర్ పిలుపు



మేడే వేడుకల్లో మాట్లాడుతున్న కర్నూలు మాజీ ఎమ్మెల్యే గఫూర్

కర్నూలు న్యూసిటీ, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా గురువారం మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. వివిధ కార్మిక, శ్రామిక, రాజకీయ తదితర పార్టీల ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు కొనసాగాయి. అన్నిచోట్లా కార్మిక జెండా రెపరెపలాడింది. పలు పార్టీలు, సంఘాల నాయకులు పార్టీ కార్యాలయాలు, కార్మిక కూడళ్లలో ఎర్రజెండాలను ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాపాడాలని నినాదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వ,ఉద్యోగ, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని నాయకులు పిలుపునిచ్చారు. సీపీఎం, సీపీఐ, ఏఐటీయూసీ, సీఐటీయూ, టీఎన్‌టీయూసీ, ఐఎన్‌టీయూసీ తదితర సంఘాల ఆధ్వర్యంలో మేడే వేడుకలు జరిగాయి. కర్నూలు నగరంలోని బళ్లారి చౌరస్తా నుంచి మార్కెట్ యార్డు వరకు కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో సీపీఎం సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ అరుణపతాకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. అనంతరం సుందరయ్య భవన్‌లో సుందరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో గఫూర్ మాట్లాడుతూ ప్రపంచంలోనే కష్టజీవుల జెండా ఎర్రజెండా అన్నారు. కార్మికులపై కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 20న దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు సమ్మె నిర్వహిస్తున్నాయన్నారు. ఆ సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పీఎస్.రాధాకృష్ణ, ఆనంద్‌బాబు, రాముడు, పి.నిర్మల, నగర కార్యదర్శివర్గసభ్యులు ఆర్.నరసింహులు, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

- సీపీఐ జిల్లా సమితి కార్యాలయంలో మేడే ఉత్సవాలను ఘనంగా జరిగాయి. జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక రాజ్య స్థాపన కోసం అందరూ కలిసికట్టుగా పోరాటాలకు సిద్ధం కావాలన్నారు.



మేడే వేడుకల్లో కళాకారుల నృత్యాలు





కర్నూలులో హాజరైన కార్మికులు

నంచర్లకు మహర్దశ..!

చిప్పగిరి మండలం నంచర్ల గ్రామం గుంతకల్లు జంక్షన్ రైల్వే స్టేషన్‌కు పది కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ గ్రామం మీదుగా వెళ్లే ఒక రైలు మార్గంలో నంచర్ల రైల్వే స్టేషన్, మరో మార్గంలో మల్లప్పగేట్ స్టేషన్ ఉంది. గుంతకల్లు జంక్షన్ నుంచి భారతదేశంలో పలు ప్రాంతాలకు రైలు మార్గాలు ఉన్నాయి. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రైళ్ల సంఖ్య పెరగడం వల్ల రైళ్లు, గూడ్స్ రాకపోకల కోసం పలు రైళ్లు జంక్షన్‌కు సమీపంలోని స్టేషన్లలో గంటల తరబడి ఆపాల్సి వస్తున్నది. ఈ సమస్యకు పరిష్కారంగా గుంతకల్లు జంక్షన్ స్టేషన్‌కు గూడ్స్ రైళ్లు రాకుండానే బయటి నుంచే పంపేందుకు రూ.293 కోట్లతో మల్లప్పగేట్ (నంచర్ల) - గుంతకల్లు వెస్ట్ స్టేషన్ల మధ్య రైల్ ఓవర్ రైల్ (ఆర్ఓఆర్) డబుల్ రైల్వేలైన్ నిర్మాణం పనులకు శ్రీకారం చుట్టారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ పనులకు నేడు అమరావతిలో శంకుస్థాపన చేయనున్నారు. ఆ వివరాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.



చిప్పగిరి మండలం నంచర్ల దగ్గర మల్లప్పగేట్ రైల్వే స్టేషన్

- మల్లప్ప గేట్ - గుంతకల్లు వెస్ట్ స్టేషన్ వరకు బైపాస్ రైలు మార్గం
- రూ.293 కోట్లతో ఆర్ఓఆర్ రైల్వే ప్రాజెక్టు
- నేడు ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన
- గుంతకల్లు జంక్షన్‌కు వెళ్లకుండానే గూడ్స్ రైళ్ల రాకపోకలు
- సమయానికి ప్యాసింజర్ రైళ్లు నడిచే అవకాశం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న భూ నిర్వాసిత రైతులు

కర్నూలు, మే 1 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే పరిధిలో గుంతకల్లు రైల్వే డివిజన్ అత్యంత కీలకమైనది. గుంతకల్లు జంక్షన్ రైల్వే స్టేషన్‌లో ఏడు ప్లాట్‌ఫారాలు ఉన్నాయి. ఈ జంక్షన్ నుంచి గుంతకల్లు-గోవా, వాస్కోడిగామా వయా బళ్లారి, గుంతకల్లు-ముంబాయి వయా ఆదోని, రాయచూరు, గుల్బర్గా, గుంతకల్లు-హైదరాబాద్ వయా మద్దికెర, డోన్, కర్నూలు, గుంతకల్లు-గుంటూరు వయా డోన్, నంద్యాల, గుంతకల్లు-బెంగళూరు వయా అనంతపురం, ధర్మావరం, హిందూపురం, గుంతకల్లు-చెన్నై వయా గుత్తి, కడప.. వంటి ప్రధాన రైల్వేలైన్లు ఉన్నాయి. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు భారతదేశంలోని ప్రధానమైన ప్రాంతాలకు ఇక్కడి నుంచి రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. అదే క్రమంలో గూడ్స్ రైళ్లు సరేసరి. బళ్లారి జిల్లాలోని జిందాల్ స్టీల్ పరిశ్రమ నుంచి గూడ్స్ రాకపోకలు భారీగా పెరిగాయి. దీంతో గుంతకల్లు స్టేషన్ నుంచి వివిధ ప్రాంతాలకు రైళ్ల రాకపోకల రద్దీ దృష్ట్యా కొన్ని రైళ్లను సమీపంలోని రైల్వే స్టేషన్లలో గంటల తరబడి ఆపాల్సి వస్తుంది. దీంతో ప్రయాణిలను తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే క్రమంలో రైళ్లకు ఇంజన్లు మార్చాల్సి వస్తే కూడా ఇబ్బందులు తప్పడం లేదు. గుంతకల్లు జంక్షన్ స్టేషన్‌కు 3 కి.మీల దూరంలో గుంతకల్లు-బళ్లారి రైలు మార్గంలో గుంతకల్లు వెస్ట్ స్టేషన్ ఉంది. 8 కి.మీల దూరంలో గుంతకల్లు - గుంటూరు రైలుమార్గంలో మల్లప్పగేట్ (నంచర్ల) స్టేషన్ ఉంది. ఈ రెండు స్టేషన్ల మధ్య రైల్ ఓవర్ రైల్ (ఆర్ఓఆర్) డబుల్ రైల్వేలైన్ నిర్మాణానికి రైల్వేశాఖ సన్నాహాలు చేస్తున్నది.

నేడు ప్రధాని మోదీ శంకుస్థాపన

పడమర గుంతకల్లు - మల్లప్పగేట్ మధ్య ఆర్ఓఆర్ రైల్వేలైన్ నిర్మాణం చేస్తే గుంటూరు, బళ్లారి మధ్య రాకపోకలు సాగించే గూడ్స్ రైళ్లు గుంతకల్లు జంక్షన్ స్టేషన్‌కు రాకుండానే నేరుగా బళ్లారి, గుంటూరు వైపు వెళతాయి. ఈ రైల్వే ప్రాజెక్టు కోసం రూ.293 కోట్లు రైల్వే శాఖ కేటాయించింది. కర్నూలు జిల్లాలో చిప్పగిరి, నంచర్ల, దౌలతాపురం మధ్య ఈ రైల్వేలైన్ నిర్మిస్తారు. ఈ పనులకు ప్రధాని నరేంద్రమోదీ నేడు అమరావతి నుంచి వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేయనున్నారు. అలాగే.. గుంతకల్లుకు పది కి.మీల దూరంలో గుంతకల్లు-ముంబాయి వయా ఆదోని రైలుమార్గంలో నంచర్ల స్టేషన్ ఉంది. అక్కడి నుంచి గుంతకల్లు వెస్ట్ స్టేషన్ కలుపుతూ మరో బైపాస్ రైల్వే లైన్ నిర్మాణానికి రూ.300 కోట్లు కేటాయించారు. బైపాస్ రైల్వేలైన్లు నిర్మాణం పూర్తయితే మల్లప్పగేట్ రైల్వేస్టేషన్ రైల్వేయార్డుగా అభివృద్ధి చేసే అవకాశం ఉందని రైల్వే అధికారులు తెలిపారు. అదే జరిగితే చిప్పగిరి మండలంలోని నంచర్ల సహా వివిధ గ్రామాల ప్రజలకు ఉపాధి లభిస్తుంది.

ఆందోళనలో భూ నిర్వాసితులు

మల్లప్పగేట్ - గుంతకల్లు వెస్ట్ స్టేషన్ మధ్య నిర్మించే ఆర్ఓఆర్ డబుల్ లైన్ బైపాస్ రైలుమార్గం కోసం మండల కేంద్రం చిప్పగిరి గ్రామంలో 27 మంది రైతుల నుంచి 26.67 ఎకరాలు, దౌలతాపురంలో 21 మంది రైతుల నుంచి 8.08 ఎకరాలు, నంచర్ల గ్రామానికి చెందిన ఒక రైతు నుంచి 0.10 ఎకరాలు కలిపి 34.65 ఎకరాల భూ సేకరణ చేయాల్సి ఉంది. పత్తికొండ ఆర్డీవో పర్యవేక్షణలో భూసేకరణ చేపడుతున్నట్లు ఇప్పటికే రైల్వే అధికారులు నోటీసు జారీ చేశారు. హంద్రీ నీవా కాలువ రావడంతో భూములకు భారీ డిమాండ్ పెరిగింది. రైల్వేలైన్ కోసం సేకరించే భూములకు ఇచ్చే పరిహారం వల్ల కోల్పోయే భూముల్లో సగం కూడా రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న రైల్వేలైన్ పక్కనే మరో లైన్ నిర్మాణానికి అవసరమైన భూములున్నాయని, అక్కడే అదనపు రైలుమార్గం నిర్మించేందుకు అవకాశాలను పరిశీలించాలని రైతులు కోరుతున్నారు.



గుంతకల్లు- గుంటూరు వయా మద్దికెర డబ్లింగ్ బైపాస్ రైల్వేలైన్

గుంటూరు-గుంతకల్లు డబ్లింగ్ రైల్వేలైన్ ప్రారంభించనున్న ప్రధాని మోదీ

గుంతకల్లు-గుంటూరు వయా మద్దికెర, తుగ్గలి, ఆర్ఎస్ పెండేకల్లు, డోన్, బేతంచెర్ల, నంద్యాల మీదుగా డబుల్ రైల్వేలైన్ పనులు తుది దశకు చేరుకున్నాయి. 401 కి.మీల ఈ రైలుమార్గం డబ్లింగ్, విద్యుద్దీకరణ కోసం రూ.3,887 కోట్లతో ఐదేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఈ మొత్తం వ్యయంలో రైల్వే శాఖ, రాష్ట్ర ప్రభుత్వం చెరిసగం భరించాలని ఒప్పందం ఉంది. పనులు పూర్తయిన మార్గంలో ఇప్పటికే రైళ్ల రాకపోకలకు రైల్వేశాఖ అనుమతి ఇచ్చింది. నల్లమలలో టన్నెల్ (సొరంగం) సహా ఉమ్మడి కర్నూలు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఈ పనులు పూర్తి చేస్తే.. బెంగళూరు, గోవాతో పాటు రాయలసీమలోని వివిధ ప్రాంతాల నుంచి రాజధాని అమరావతికి వేగంగా చేరుకోవడానికి ఎంతో అనుకూలంగా ఉంటుంది. 1.30 గంటలు సమయం ఆదా అవుతుందని రైల్వే అధికారులు తెలిపారు. గుంతకల్లు-గుంటూరు రైల్వేలైన్ డబ్లింగ్, విద్యుద్దీకరణలో భాగంగా చేపట్టిన బుగనపల్లి, పాణ్యం లైన్‌ను 18 కి.మీలు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించనున్నారు.

4న నీట్ పరీక్ష

- జిల్లాలో 16 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- హాజరు కానున్న 4,466 మంది విద్యార్థులు
- ఉదయం 11గంటల నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతి
- కలెక్టర్ రంజిత్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు సంబంధించిన నీట్ యూజీ-2025 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నీట్ యూజీ పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై చీఫ్ సూపరింటెండెంట్లు, లైన్ డిపార్టుమెంటు అధికారులు, పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 4న జిల్లాలో 16 పరీక్షా కేంద్రాల్లో నీట్ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రాలన్నీ కర్నూలు నగరంలోనే ఉన్నాయన్నారు. పరీక్షకు మొత్తం 4,466 మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు ఆఫ్‌లైన్ విధానంలో పరీక్ష జరుగుతుందన్నారు. ఉదయం 11 గంటల నుంచి విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు. మధ్యాహ్నం 1:30 గంటల తర్వాత విద్యార్థులను అనుమతించరని తెలిపారు. ప్రతి 4 కేంద్రాలకు ఒక జిల్లా అధికారిని నియమించామన్నారు. ప్రతి కేంద్రానికి ఒక సీఐ లేదా ఎస్ఐ స్థాయి పోలీసు అధికారిని నియమించినట్లు తెలిపారు. అలాగే సెంటర్ అబ్జర్వర్‌ను కూడా నియమించామన్నారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో 163 బీఎన్ఎస్ సెక్షన్ విధించి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్లను, పోలీసు అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నగరంలో అభ్యర్థులకు ట్రాఫిక్ వల్ల ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ షాపులు మూసివేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ హుసేన్‌పీరా, డీఎస్పీ బాబు ప్రసాద్, డీఆర్వో వెంకట నారాయణమ్మ, నోడల్ ఆఫీసర్ (కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్) పాయల్ ప్రియదర్శిని, డీఈవో శామ్యూల్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

నాబార్డు రుణంతో గ్రామీణ రోడ్లు

ఉమ్మడి జిల్లాలో 29 పనులకు రూ.42 కోట్ల మంజూరు

కర్నూలు న్యూసిటీ, మే 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో నాబార్డు రుణ సహకారంతో 29 పనులకు రూ.42 కోట్లు మంజూరు చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. నాబార్డు ఆర్ఐడీఎఫ్ కింద 30వ విడత కార్యక్రమం కింద రూ.42 కోట్లతో పనులు చేపట్టనున్నారు. మైదాన ప్రాంతాలు, ఎస్సీ, ఎస్టీ నివాసిత ప్రాంతాల్లో పనులు మంజూరు చేస్తూ ఆదేశాలిచ్చారు. నంద్యాల జిల్లాకు 16 పనులకు రూ.25.39, కర్నూలు జిల్లా 13 పనులకు రూ.17.13 కోట్లు మంజూరు చేశారు.

పులిరాజుకు ప్రాణగండం





- పెద్దపులులకు పొంచివున్న గండం
- మూడేళ్లలో మూడు పెద్దపులులు మృతి
- నేటికీ కనిపించని తల్లి పులి ఆచూకీ
- అధిక అటవీ విస్తీర్ణంతో సన్నగిల్లిన పర్యవేక్షణ
- తాజాగా వెలుగులోకి మరో పెద్దపులి కళేబరం

ఆత్మకూరు, మే 1(ఆంధ్రజ్యోతి): నల్లమలలో పెద్దపులుల సంఖ్య ఇప్పుడిప్పుడే పెరుగుతున్న క్రమంలో అదేస్థాయిలో పులుల మరణాలు పర్యావరణ ప్రేమికుల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. గురువారం కొత్తపల్లి మండలంలోని గుమ్మడాపురం బీట్‌లో పెద్దపులి కళేబరాన్ని అధికారులు గుర్తించారు. పర్యావరణ సూచికలో అగ్రభాగాన నిలిచిన పెద్దపులుల సంఖ్యలో ప్రపంచవ్యాప్తంగా క్షీణిస్తున్నప్పటికీ భారత్‌లో మాత్రంగా కొంతమేర ఆశాజనకంగానే ఉన్నాయి. ప్రత్యేకించి నల్లమలలో కూడా పులుల ప్రత్యుత్పత్తి సజావుగా సాగుతోంది. ఈ నేపథ్యంలో పులుల సంఖ్యను మరింత పెంచేందుకు నేషనల్ టైగర్స్ కన్జర్వేషన్ ఆథారిటీ (ఎన్‌టీసీఏ) ఎంతగానో ప్రయత్నాలు చేస్తోంది. పెద్దపులుల మనుగడకు సంబంధించి ప్రతి అంశాన్ని సూక్ష్మంగా పరిగణించి పెద్దపులుల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తోంది. గడిచిన మూడేళ్లలో ఒక్క ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ పరిధిలోనే మూడు పెద్దపులులు వివిధ కారణాలతో పాటు సహజంగా మరణించాయి. ఒక పులి ఆచూకీ లేకుండా పోయింది. అదేవిధంగా మరో పులి వేటగాళ్ల ఉచ్చుకు చిక్కి తీవ్రంగా గాయపడగా అటవీశాఖ అధికారులు రక్షించారు. ఇలా ప్రతిఏటా ఏదో ఒక కారణంతో పెద్దపులుల మరణించడం అటవీశాఖలో కలకలం రేపుతోంది.

మూడేళ్లలో మూడు పెద్దపులులు మృతి

- 2022 మే 11న ఆత్మకూరు డివిజన్ పరిధిలోని బైర్లూటి రేంజ్, పెద్దఅనంతాపురం సెక్షన్, పీఏపురం నార్త్‌బీట్ లోతువాగు సమీపంలో ఓ పెద్దపులి (టీ-94) అనుమానాస్పదంగా మృతిచెందినట్లు 20 రోజుల తర్వాత అటవీ అధికారులు గుర్తించారు. అయితే ఇది ఆవాస మార్పు కారణంగా మరో పులితో జరిగిన భీకర పోరులో సహజసిద్ధంగా మరణించినట్లు అప్పట్లో అటవీ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. పెద్దపులి నమూనాలను ల్యాబ్‌కు పంపించిన వాస్తవానికి తెలియజేస్తామని చెప్పినప్పటికీ ఇంతవరకు ఆ వివరాలను వెల్లడించలేదు.
- 2022 ఆగస్టు 9వ తేదీన వెలుగోడు రేంజ్‌లోని నార్త్‌బీట్ పరిధిలో ఉన్న గుండ్ల మల్లెలమ్మ బేస్‌క్యాంపు సమీపంలో వెలుగోడు జలాశయం బ్యాక్‌వాటర్ ప్రదేశంలోని బుడగల వాగులో ఓ పెద్దపులి (టీ-48) కళేబరాన్ని అటవీ అధికారులు గుర్తించారు. అయితే ఆ పులికి మెడ చుట్టూ క్లచ్‌వైర్ ఉచ్చు ఉండటంతో తీవ్ర గాయమై రక్తస్రావం, చీము పట్టి మృతిచెందింది. ఇదికూడా అనుమానాస్పద మృతిగా నమోదు చేసినప్పటికీ ఈ ఘటనకు సంబంధించిన వాస్తవాలను అటవీ అధికారులు వెల్లడించలేదు.
- తాజాగా ఆత్మకూరు రేంజ్, ముసలిమడుగు సెక్షన్, గుమ్మడాపురం బీట్ పరిధిలో గల దేవరసెల వద్ద ఏప్రిల్ 30న ఓ పెద్దపులి కళేబరాన్ని గుర్తించారు. అయితే మృతికి గల కారణాలపై అటవీ అధికారులు ఎలాంటి స్పష్టత ఇవ్వలేక పోతున్నారు. పెద్దపులి శరీర అవయవాలను సేకరించి సీసీఎంబీ హైదరాబాద్‌కు పంపిస్తున్నామని, రిపోర్టు వచ్చాకే వివరాలు తెలియజేస్తామని అటవీ శాఖాధికారులు చెబుతున్నారు.

మిగతా 7వ పేజీలో



ప్రతి రోగికి ఆధార్, అబా కార్డు తప్పనిసరి

కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు



ఆర్థో వైద్యులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి వారి వెంట ఆధార్, అబా కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.వీ. వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఆయన పలు విభాగాలను తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని పలు ఓపీ, ఐపీ విభాగాలకు వచ్చే రోగులకు అందుతున్న వైద్యసేవల అభిప్రాయాన్ని క్యూఆర్ కోడ్‌లో నమోదు చేయాలని, దీనిపై రోగులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి రోగి వారివెంట ఆధార్, ఆబా కార్డులను తీసుకుని రావడంతో ఓపీ నమోదు ప్రక్రియ ఇతర ఏవలు వేగంగా జరుగుతాయన్నారు. బూత్‌బంగ్లా, సర్జికల్, ఆర్థో విభాగంలోని ఆపరేషన్ థియేటర్‌లో పర్యటించి రోగులకు యూనిట్ వారీగా ఎన్ని ఆపరేషన్లు చేస్తున్నారో ఆరాతీశారు. సూపరింటెండెంట్ వెంట డిప్యూటీ సూపరింటెండెంట్ డి.శ్రీరాములు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ వి.సింధూ సుబ్రహ్మణ్యం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాల నాగాంజన్, కిరణ్ కుమార్, సునీల్ ప్రశాంత్ ఉన్నారు.

కారుణ్య నియామకంలో గందరగోళం

ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు బాలస్వామి నాయక్

కర్నూలు హాస్పిటల్, మే 1(ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామకంలో గందరగోళం నెలకొంది. నంద్యాల వైద్యవిధాన పరిషత్ పరిధిలో పని చేస్తూ చనిపోయిన ఓ ఉద్యోగి కుటుంబానికి కారుణ్య నియా మకం కింద కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పోస్టు ఎలా ఇస్తారని ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఎన్. బాలస్వామి నాయక్ ప్రశ్నించారు. గురువారం కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు వినతి పత్రం సమర్పించారు. నిబంధనల ప్రకారం ఇతర విభాగాల్లో విధులు నిర్వహిస్తూ మరణించిన కుటుంబ సభ్యులకు అక్కడే ఆ విభాగంలోనే కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. ఒకవేళ అక్కడ పోస్టులు ఖాళీ లేకపోతే వైద్యవిధాన పరిషత్ డీసీహెచ్‌ఎస్, డీఎంహెచ్‌వో ద్వారా కలెక్టర్ కార్యాలయానికి వివరాలు పంపాలన్నారు. కలెక్టర్ పరిశీలించి ధ్రువీకరించిన తర్వాత ఖాళీలు ఉన్న విభాగాల్లో నియామకాలు చేపట్టాల్సి ఉందన్నారు. ఇతర విభాగాల్లో చనిపోయిన కుటుంబాలకు నేరుగా కర్నూలు జీజీహెచ్‌లో పోస్టులు ఇవ్వడం అన్యాయమన్నారు. సూపరింటెండెంట్ స్పందించి కారుణ్య నియామకాలను క్షుణ్ణంగా పరిశీలిస్తామన్నారు. యూనియన్ శాఖ కార్యదర్శి ఎస్.ఖాజా మొహిద్దీన్, కోశాధికారి సురేష్ పాల్గొన్నారు.

శాంతి చర్చలు ప్రారంభించాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

కర్నూలు కల్చరల్, మే 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆదివాసులపై, మావోయిస్టులపై చేస్తున్న యుద్ధాన్ని బేషరతుగా నిలిపివేసి శాంతి చర్చలను ప్రారంభించాలని కర్నూలులో వామపక్షపార్టీలు, ప్రజాసంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఐ భవన్‌లో పౌరహక్కుల సంఘం నాయకులు అల్లాబకాష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ వామపక్షాల పార్టీల నేతలు పాల్గొని తమ అభిప్రాయాలను తెలిపారు. సీపీఐఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, విరసం బాధ్యుడు పాణి, రైతుకూలీ సంఘం నాయకులు సుంకన్న, ఏఐటీయూసీ నాయకులు జగన్నాథం, లెనిన్, ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ రత్నం ఏసేపు, రాజగోపాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కార్పొరేట్ల కోసం బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని త్వరలో నగరంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

గూడూరు మే 1(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ అధ్యక్షుడు మండల జే.సురేష్ అన్నారు. గురువారం మండలంలోని కె.నాగులాపురం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు అందిస్తామన్నారు. టీడీపీ నాయకులు గోపాల్ రెడ్డి, ఇక్బాల్, ఎర్రమల, సురేంద్ర, ప్రతాప్, యుగంధర్ పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, మే 1(ఆంధ్రజ్యోతి): నగరంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. గురువారం ఆయన కొత్తపేటలోని నూతనంగా నిర్మించిన మురుగు కాలువలు, పాత కంట్రోల్‌రూమ్, పెద్ద పడఖాన, అంబేడ్కర్ కూడలిలో పారిశుధ్య పనులను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో మొత్తం రూ.44.47 కోట్లతో 330రకాల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ఎంఈ సత్యనారాయణ, డీఈ గంగాధర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఉన్నారు.

జిల్లా క్రికెట్ సంఘం మాజీ కార్యదర్శి మృతి

కర్నూలు స్పోర్ట్స్, మే 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ సంఘం మాజీ కార్యదర్శి ఎస్.చంద్రశేఖర్ (62) గుండెపోటుతో మృతి చెందినట్లు ఆయన సతీమణి భారతి తెలిపారు. గురువారం నగరంలోని దేవనగర్ తన నివాసంలో చంద్రశేఖర్ భౌతిక కాయాన్ని సందర్శించి పలువురు బంధువులతో పాటు క్రీడా సంఘం ప్రతినిధులు శ్రద్ధాంజలి ఘటించారు. చంద్రశేఖర్ కార్యదర్శి కాలంలో కర్నూలు స్టేడియంలో రంజీ క్రికెట్ పోటీలను నిర్వహించి మన్ననలు పొందిన ఘనత ఆయనదేనన్నారు. అలాగే పలు రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు, మహిళా క్రికెట్ పోటీలను నిర్వహించి ఎంతో మంది క్రీడాకారులను గుర్తింపులోకి తీసుకువచ్చారనీ క్రీడాసంఘాల ప్రముఖులు కొనియాడారు. జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.రామాంజనేయులు, క్రికెట్ సంఘం నాయకులు దేవేందర్‌గౌడు, రమేష్, పాలశ్రీను, క్రీడా సంఘం నేతలు గంగాధర్, షేక్షావలి, విజయ కుమార్, చిన్న సుంకన్న, వెంకటేశ్వర్లు, షకీల్ అహ్మద్, డా.మాణిక్య రావు, రిటైర్డు ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, ప్రేమ్‌నాథ్‌గౌడు సందర్శించి నివాళులర్పించారు.

నాసిరకం విత్తనాలను విక్రయిస్తే చర్యలు: ఏవో

సి.బెళగల్, మే 1 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాసిరకం విత్తనాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ విత్తన దుకాణాల యజమానులను హెచ్చరించారు. గురువారం సి.బెళగల్‌లోని విత్తన దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఏవో వెంట ఎంపీఈవోలు వెంకటేశ్, ఈశ్వర్ ఉన్నారు.

కార్మిక హక్కుల కోసం పోరాటం

● సీపీఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య
● ఘనంగా మేడే వేడుకలు

కర్నూలు న్యూసిటీ, మే 1(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కుల కోసం పోరాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సీపీఐ జిల్లా సమితి కార్యాలయంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బి.గిడ్డయ్య జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, డి.శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, బీసన్న, నాగరాజు, శ్రావణి రెడ్డి పాల్గొన్నారు.

● 8 గంటల పని విధానాన్ని కాపాడుకునేందుకు, లేబర్ కోడ్లను రద్దు చేసేందుకు కార్మికులు ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప పిలుపునిచ్చారు. మేడేను పురస్కరించుకుని నగరంలో ఆటో, హమాలీ, మెడికల్, ఆర్టీసీ, ఏపీ టూరిజం, విద్యుత్ రంగ కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జెండాలను ఎగురవేసి స్థానిక రైల్వే స్టేషన్ నుంచి ఏఐటీయూసీ కార్యాలయం వరకు ఆటో కార్మికులతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన వాగ్దానాలు ఇప్పటికి అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, టి.రామాం జనేయులు, కిట్టు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నల్లన్న, డీసీ.రహిమాన్ పాల్గొన్నారు.

● కర్నూలు జిల్లా మోటార్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం ఎదుట ఎర్రజెండాను ఆవిష్కరించారు.

● సీఐటీయూ పాతబస్తీ కమిటీ ఆధ్వర్యంలో నగరంలో జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షుడు రాజశేఖర్, రామాంజనేయులు, అబ్దుల్ దేశాయ్, మైమూద్ పాల్గొన్నారు.

● 23వ వార్డు శ్రీరామ్‌నగర్‌లో సీపీఎం నాయకుడు సి.శేషాద్రి జెండాను ఆవిష్కరించారు.

● వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ అధ్వర్యంలో సి.క్యాంపు సెంటర్‌లో జిల్లా అధ్యక్షుడు భీమేశ్వరరెడ్డి, నగర అధ్యక్షుడు కొట్టాల ప్రకాష్ అధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

● రోజా మహిళా ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత బీడి కార్మికులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. సుమలత మాట్లాడుతూ శ్రమ దోపిడీ వ్యతిరేకించి కార్మిక కర్షక సమాజం ఐక్యంగా పిడికిలి బిగించాలన్నారు. .

● ఐఎఫ్‌టీయూ అధ్వర్యంలో నంద్యాల చెక్‌పోస్టు, సి.క్యాంపు, శకుంతల కల్యాణ మండపం కూడళ్లలో మే డేను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి సురేష్‌నాయక్, సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ నగర కార్యదర్శి వెంకటేశ్వర్లు వెంకటస్వామి, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కే.భాస్కర్ పాల్గొన్నారు.

టీఎన్‌టీయూసీ కార్యాలయంలో..

కర్నూలు అర్బన్: కార్మికులకు అండగా టీఎన్‌టీయూసీ సేవలు అందిస్తుందని కుడా చైర్మన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం నగరంలో టీఎన్‌టీయూసీ కార్యాలయంలో మే డే వేడుకలు జిల్లా అధ్యక్షులు వై.నరసింహులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్ అధ్వర్యంలో జరిగాయి. రాష్ట్ర నాయకురాలు సి.అరుణకుమారి, టీడీపీ సీనియర్ నాయకులు గౌరు వెంకటరెడ్డి హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో మోహన్‌రావు, సత్రం రామకృష్ణుడు, రామక్రిష్ణ, గోపవరం నాయుడు, సలాం, దివాకర్ ఉమ్మర్ బాషా, మాధవరాజుపాల్గొన్నారు.

● ఐన్‌టీయూసీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు బి.బతుకన్న ఆధ్వర్యంలో మే డేను నిర్వహించారు. గురువారం ఉదయం జిల్లా కార్యదర్శి ఆనంద్, కిషోర్‌లు జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఐన్‌టీయూసీ నగర అధ్యక్షుడు ప్రతాప్, ఉపాధ్యక్షుడు ఆశీర్వాదం, జిల్లా సెక్రటరీ మహేష్ పాల్గొన్నారు.

ఓర్వకల్లు: ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడి కార్మికుల హక్కులను కాపాడుకుందామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యు డు రామకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని కేతవరం, ఓర్వ కల్లు, నన్నూరు, శకునాల, హుశేనాపురం, ఉయ్యాలవాడ గ్రామాల్లో మే డేను ఘనంగా నిర్వహించారు. కేతవరంలో రామకృష్ణ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నాగన్న, నాయకులు షాజహాన్, శ్రీధర్, చంద్రబాబు నాయుడు, సుధాకర్, చాంద్‌బాషా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● ఓర్వకల్లులో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. గురువారం ఓర్వకల్లులో ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మే డేను ఘనంగా నిర్వహించారు. నాయకులు సంజీవరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్ర మానికి రమేష్ హాజరై మాట్లాడారు. 21, 31 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మోహన్, మహబూబ్ బాషా, సుధాకర్, బాలరంగయ్య, బాబు, చిన్న, సురేంద్ర, రఫీ, పాల్గొన్నారు.

కోడుమూరు: పట్టణంలో సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో గురువారం మే డేను ఘనంగా నిర్వహించారు. పాతబస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కూడళ్లలో ఎర్ర జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సుభాన్, గఫూర్‌మియా, లక్ష్మన్న, వీరన్న, కుమారస్వామి, కార్మికులు మధు, మద్దిలేటి, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు మునిస్వామి, రాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచు భాగ్యరత్న ఆధ్వర్యంలో మే డేను నిర్వహించారు. ఈసంద ర్భంగా పంచాయతీ కార్మికులను సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అజయ్‌భాస్కర్, శానిటేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, జూనియర్ అసిస్టెంట్ సురేష్, లక్ష్మీ పాల్గొన్నారు.

● టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో మే డే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ అధ్యక్షుడు గోపాల్‌నాయుడు అధ్యక్షతన ఈ వేడుకలు చేపట్టారు. స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన టీఎన్‌టీయూసీ జెండాను ఆవిష్కరించారు. టీఎన్‌టీయూసీ నాయకుడు బడేసాగౌడ్, టీడీపీ నాయకులు బ్రిటీష్ రాముడు, భాస్కర్, రాముడు, రవి, బలరాం, మధు, శంకర్‌రెడ్డి, కౌలుట్ల పాల్గొన్నారు.

గూడూరు: మండలంలోని గూడూరు, కె.నాగులాపురం గ్రామాల్లో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం గూడూరు పట్టణంలో సీఐటీయూ కార్యాలయం ముందు జెండాను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ నారాయణ, అలాగే హమాలీ సంఘం ఏర్పాటు చేసిన జెండాను సీఐటీయూ జిల్లా కార్యదర్శి జే.మోహన్ ఆవిష్క రించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు గుంటప్ప, హమాలీలు, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

కల్లూరు: కల్లూరు మండలం, అర్బన్ ప్రాంతాల్లో వామపక్ష, వివిధ కార్మిక సంఘాల నాయకులు గురువారం మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎర్రజెండాను ఆవిష్కరిం చారు. ఈసంద ర్భంగా నాయకులు సీహెచ్.సాయిబాబా, సుధాకరప్ప, జి.రామకృష్ణ, మధు, కృష్ణలు మాట్లాడుతూ మే డే స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపుని చ్చారు. కల్లూరు మండలం ముజఫర్‌నగర్, కృష్ణానగర్, శరీన్‌నగర్, ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లలో వామపక్ష, కార్మికసంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టారు.

● లక్ష్మీపురం పరిధిలోని భారతగ్యాస్ ఫిల్లింగ్ కంపెనీ నంది తెలుగునాడు యూనియన్ ఆధ్వర్యంలో నందికొట్కూరు టీడీపీ ఇన్ చార్జి గౌరు వెంకటరెడ్డి జెండాను ఆవిష్కరించారు. కార్మికులకు గౌరు వెంకటరెడ్డి మే డే శుభాకాంక్షలు తెలిపారు. కార్మికులు లేనిదే కంపెనీలు నడిచే పరిస్థితి లేదని, కలిసికట్టుగా పనిచేసి దేశ అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగునాడు వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.





కోడుమూరు, కేతవరంలో జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు, గూడూరులో మాట్లాడుతున్న సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జే.మోహన్



కర్నూలులో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు



జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు



టీఎన్‌టీయూసీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు



లక్ష్మీపురంలో జెండాను ఆవిష్కరిస్తున్న గౌరు వెంకటరెడ్డి



కర్నూలు జీజీహెచ్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు



ఓర్వకల్లులో జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ మండల కార్యదర్శి రమేష్

కర్నూలు హాస్పిటల్: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం యూనియన్ ఆఫీసులో ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధూ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మునెప్ప, ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలు స్వామి నాయక్ మాట్లాడుతూ ఎంతో మంది ప్రాణత్యాగం చేసి సాధించిన ఈ హక్కులను కాపాడేందుకు ఐక్యంగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ ఖాజామొద్దీన్, ట్రెజరర్ సురేష్, సర్జెంట్ ఉరుకుందయ్య, హెల్త్ ఇన్స్‌పెక్టర్ టి.గోవిందు స్వామి, హరిశ్చంద్ర నాయుడు పాల్గొన్నారు.

మోదీకి ఘనస్వాగతం పలుకుదాం

నాయీబ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్



విజయకుమార్

కర్నూలు అర్బన్, మే 1(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని పనుల ప్రారంభానికి ఈనెల 2న రానున్న ప్రధాని నరేంద్ర మోదీకి రాష్ట్ర ప్రజలంతా ఘన స్వాగతం పలుకుదామని నాయీబ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ పాలక వీటి విజయకుమార్ అన్నారు. గురువారం నగరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సీఎం చంద్రబాబు అధికారం చేపట్టిన పది నెలల్లోనే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారన్నారు. పోలవరానికి, స్టీల్ ప్లాంట్‌కు నిధులు, విశాఖ రైల్వేజోన్ మంజూరు చేయించారని తెలిపారు.

మోదీకి క్షమాపణ చెప్పాలి: బీజేపీ

కర్నూలు కలెక్టరేట్, మే 1(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని, భారతీయ జనతా పార్టీని కించపరుస్తూ ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి మాట్లాడిన విషయంపై మోదీకి క్షమాపణ చెప్పాలని బీజేపీ అధికార ప్రతినిధి సాయి ప్రదీప్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ దేశానికి అంతర్గత టెర్రరిస్టు ప్రధాని మోదీ అని షర్మిలా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

కులగణన చారిత్రక నిర్ణయం

కర్నూలు అర్బన్, మే 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణన చేయాలని నిర్ణయించడం చారిత్రకమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లో బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్యను ఆయన కలిసి శాలువతో సత్కరించారు. రాంబాబు, పీజీ వెంకటేష్, కుమార్, రామక్రిష్ణ పాల్గొన్నారు.

హెల్త్ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

కర్నూలు హాస్పిటల్, మే 1(ఆంధ్రజ్యోతి): పెస్ట్ కంట్రోల్ ఉద్యోగి మహేష్‌ను వేధించి అతని ఆత్మహత్యాయత్నానికి కారణమైన హెల్త్ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నగర అధ్యక్షుడు ఎం.చందు అధికారులను కోరారు. కర్నూలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పెస్ట్ కంట్రోల్ ఏజెన్సీ ఉద్యోగి మహేష్‌ను గురువారం ఎమ్మార్పీఎస్ నాయకులు పరామర్శించారు.

వైకల్య పరీక్షలు మళ్లీ చేయాలి

కర్నూలు ఎడ్యుకేషన్, మే 1(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు వైకల్య నిర్ధారణ పరీక్షలు మళ్లీ చేయాలని గురువారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితకు ఏపీటీఎఫ్ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. 2025లో ఉపాధ్యాయ బదిలీలకు సంబంధించి ప్రత్యేక కేటగిరిలో వైకల్యం కింద బదిలీలు కోరిన ఉపాధ్యాయులకు మెడికల్ బోర్డు నిర్వహించిన నిర్ధారణ పరీక్షలు గతంలో ఇదే మెడికల్ బోర్డు వారు ఇచ్చిన సర్టిఫికెట్‌లో వైకల్యశాతం కంటే గణనీయంగా తగ్గించడంతో ఉపాధ్యాయులు నష్టపోతున్నారన్నారు. ఇస్మాయిల్, టీవీ రామ కృష్ణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్లూరు అర్బన్ వార్డుల అభివృద్ధే లక్ష్యం

● సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు ఎమ్మెల్యే గౌరు చరిత భూమి పూజ

కల్లూరు, మే 1(ఆంధ్రజ్యోతి): కల్లూరు అర్బన్ వార్డుల అభివృద్ధే లక్ష్యమని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. గురువారం నగరంలోని 37, 34వ వార్డుల్లో ఎమ్మెల్యే, కార్పొరేషన్ కమిషనర్ రవీంద్ర బాబుతో కలిసి అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 37వ వార్డు ఆదిత్యానగర్‌లో రూ.49.90 లక్షలతో సీసీ రోడ్లు, 34వ వార్డు గీతానగర్‌లో రూ.9.90 లక్షలతో డ్రైనేజీ కాల్వల నిర్మాణానికి భూమి పూజ చేశామ న్నారు. కల్లూరు అర్బన్ 16వార్డుల పరిధిలో రూ. 8కోట్ల విలువగల పనులు జరుగుతున్నాయని, వాటిని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ.రాజశేఖర్, ఎంఈ.శేషసాయి, డీఈఈ. కృష్ణలత, టీడీపీ నాయకులు కె.పార్వతమ్మ, పెరుగు పురు షోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, ఎన్వీ.రామకృష్ణ, పీయూ.మాదన్న, జె.గంగాధర్‌గౌడ్, వెంకటేశ్వరరెడ్డి, నాగరాజు, జనార్దన్ ఆచారి పాల్గొన్నారు.

● **పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే:** 37వ వార్డు వీకర్‌సెక్షన్ కాలనీలోని ఉల్చాల రోడ్‌లో ఎమ్మెల్యే గౌరుచరిత, కమిషనర్ రవీంద్రబాబుతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అయోషా సిద్దికా, నాగేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

● 31వ వార్డు షరీన్‌గనర్‌లో కర్నూలు డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు అర్హులకు పింఛన్లు పంపిణీ చేశారు. గురువారం 31వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి శైలజాయాదవ్‌తో కలిసి ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేంపేంట రాంబాబు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

వైభవంగా సాయినాథుడి ప్రభోత్సవం

కోడుమూరు రూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులకుర్తిలో సాయిబాబా ఆలయ 4వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ప్రభోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో వేదపండితుల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, అర్చన, హారతులు వంటి విశేష పూజలు జరిగాయి. సాయంత్రం ఎద్దులబండిపై సాయిబాబా ఉత్సవ విగ్రహాన్ని కొలువుంచి మేళతాళాల మధ్య భక్తులు ఎదురుమండపం వరకు లాగారు. ప్రభను తిరిగి ఆలయం వద్దకు చేర్చారు. శుక్రవారం సాయంత్రం స్వామివారి రథోత్సవం నిర్వహించనున్నారు.

పందుల దాడిలో బాలికకు గాయాలు

కల్లూరు, మే 1(ఆంధ్రజ్యోతి): కల్లూరులోని 32వ వార్డు ముజఫర్ నగర్‌లోని పోలీసు కాలనీలో పందుల దాడిలో ఓబాలికకు గాయాలైన ఘటన వెలుగుచూసింది. గురువారం కాలనీలో ఆడుకుంటున్న బాలికపై పంది దాడిచేసి గాయపరిచింది. చిన్నారి కేకలు విన్న స్థానికులు బాలికను కాపాడారు.

ఏఐసీసీ కార్యాలయంపై దాడి తగదు

కర్నూలు అర్బన్, మే 1(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ కార్యాలయంపై బీజేపీ శ్రేణులు దాడి చేయడం తగదని మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబు అన్నారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎస్సీ సెల్ జిల్లాచైర్మన్ ఎస్‌సీ బజారన్న, మాజీ ప్రధాన కార్యదర్శి సత్యానారాయణ గుప్తతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోడుమూరు ఇన్‌చార్జి అనంతరత్నం మాదిగ, డీవీ సాంబశివుడు, ఖాద్రీ బాషా తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిల గడువు పెంపు

కర్నూలు అగ్రికల్చర్, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వివిధ జిల్లాల్లోని 71 ప్రాథమిక సహకార సంఘాల(పీఏసీఎస్)కు అధికారిక పర్సన్ ఇన్‌చార్జిల పదవీ కాలాన్ని అక్టోబరు 30 వరకు (ఆరు నెలలు) పొడిగించి, మరో ఐదు పీఏసీఎస్‌లకు కొత్తగా అధికారిక పర్సన్ ఇన్‌చార్జిలను నియమించింది. ఆరునెలల పాటు నియమిస్తూ జీవో నెం.229ని గురువారం జారీచేస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈఉత్తర్వుల ప్రకారం వీరు మే 1వ తేదీ నుంచి ఆరు నెలల పాటు అంటే 30.10.2025 వరకు ఈపదవిలో కొనసాగుతారని జీవోలో పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో కృష్ణగిరి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న లక్ష్మీకాంత రెడ్డిని పర్సన్ ఇన్‌చార్జిగా నియమించారు. కల్లూరు సంఘా నికి అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న నాగ రమణయ్యను నియ మిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. నంద్యాల జిల్లాలో హనుమంత గుండం సంఘానికి అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న రాచయ్యను నియమించారు. మరో పది రోజుల్లో ఉమ్మడి జిల్లాలోని 96 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు ఎమ్మెల్యేల సిఫారసుతో పర్సన్ ఇన్‌చార్జిలుగా నియామకం చేపట్టనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

12 మంది మోడల్ స్కూల్‌కు ఎంపిక

కోడుమూరు రూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లినగరం ప్రాథమిక పాఠశాలకు చెందిన 12 విద్యార్థులు మోడల్ స్కూల్‌కు ఎంపికయ్యారు. గురువారం హెచ్ఎం సరళాదేవి మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన మోడల్ స్కూల్ ఆరోవ తరగతి ప్రవేశ పరీక్షలో తమ పాఠశాల విద్యార్థులు పతిభకనబరిచినట్లు తెలిపారు.

పులిరాజుకు ప్రాణగండం



2023 మార్చి 6న లభ్యమైన పులికూనలు ఇవే (ఫైల్)

5వ పేజీ తరువాయి

ఆత్మకూరు రేంజ్ పరిధిలోని ముసలిమడుగు సెక్షన్ సందుబాటు రస్తాలో ఓ పెద్దపులి బైక్ క్లచ్ వైర్ లాంటి ఉచ్చు నడుముకు చిక్కుకుని తీవ్రంగా గాయపడిన విషయాన్ని 2024 ఫిబ్రవరి 25వ తేదీన అటవీ అధికారులు కెమెరా ట్రాప్స్ ద్వారా గుర్తించారు. ఆ తర్వాత మార్చి 5న రెస్క్యూ ఆపరేషన్ ద్వారా పులిని బంధించి బైర్లూటిలోని వన్యప్రాణి వైద్య చికిత్సా కేంద్రంలో వారం రోజుల పాటు సపర్యలు చేసి తిరిగి అడవిలో వదిలేశారు. దీన్ని అధికారులు గుర్తించకపోయింటే ఆ పులి కూడా మరణించే అవకాశం ఉండేది.

నేటికీ కనిపించని తల్లి పులి ఆచూకీ

2023 మార్చి ఆరో తేదీన నల్లమల అడవి నుంచి నాలుగు ఆడ పులికూనలు దారితప్పి ఊళ్లోకి చేరాయి. గ్రామస్థులు ఆ పులికూనలను గుర్తించి అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు తల్లిపులి (టీ-108) ఆచూకీ కోసం అటవీ అధికారులు నాలుగు రోజుల పాటు అనేక విధాలుగా అన్వేషించినప్పటికీ ఆచూకీ లభించలేదు. చివరకు మార్చి 10వ తేదీన ఆ పులికూనలను తిరుపతిలోని ఎస్వీ జూపార్క్‌కు తరలించారు. ఈ ఘటనలో అప్పట్లోనే దేశంలోనే సంచలనం రేకెత్తించింది. అప్పట్లో తల్లి పులి క్షేమంగానే ఉందని అటవీ అధికారులు చెప్పే ప్రయత్నాలు చేసినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. ఈ సంఘటనకు సంబంధించి కూడా అటవీ అధికారులు స్పష్టత ఇవ్వలేకపోయారు. కాగా ప్రస్తుతం ఆ పులి కూనలు తిరుపతి జూలో ఉన్నప్పటికీ నాలుగు పులికూనల్లో రెండు కూనలు అనారోగ్యంతో మృతి చెందాయి.

పర్యవేక్షణ కొరవడిందా?

ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల, ప్రకాశం, పల్నాడు జిల్లాల పరిధిలో 3727.82చ.కి.మీల పరిధిలో విస్తరించిన నాగార్జునసాగర్-శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యం దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వు ఫారెస్ట్‌గా గుర్తింపు దక్కించుకుంది. అందులో 1228.11చ.కి.మీల అటవీ విస్తీర్ణం ఆత్మకూరు టైగర్ ప్రాజెక్ట్ పరిధిలో ఉంది. అయితే బ్రిటీష్ కాలం నుంచి అటవీ శాఖ పరిధిలోని డివిజన్లు, రేంజ్‌లు, సెక్షన్లు, బీట్‌లు విస్తీర్ణం విస్తారంగా ఉండటం వల్ల అటవీ సంరక్షణ సన్నగిల్లుతోందన్న విమర్శలు ఉన్నాయి. వాస్తవానికి ప్రస్తుతం నల్లమలలో ఒక్కో ఫారెస్ట్ బీటు 3వేల హెక్టార్ల నుంచి 10వేల హెక్టార్ల వరకు విస్తీర్ణం ఉన్నాయి. టైగర్ జోన్ కావడం వల్ల ఒక్కో బీటు 1500 హెక్టార్ల చొప్పున విభజిస్తే అడవులు, వన్యప్రాణుల సంరక్షణ సజావుగా ఉంటుందని అటవీ శాఖకు చెందిన సీనియర్ ఉద్యోగులు చెబుతున్నారు. ఈ అంశాన్ని ఎన్నో దశాబ్దాలుగా అటవీశాఖ దృష్టికి తీసుకెళ్తున్నా ఫలితం లేదని అంటున్నారు. అదేక్రమంలో అటవీ శాఖగా సమృద్ధిగా ఉద్యోగుల నియామకం చేపట్టాల్సిన ఆవశ్యకత నెలకొంది. అరకొర నియామకాల వల్ల అటవీ, వన్యప్రాణి సంరక్షణ సజావుగా జరగడం లేదన్న విమర్శలు ఉన్నాయి. దీనివల్లనే నల్లమలలో పులులు మరణిస్తున్నా గుర్తించడం ఆలస్యమవుతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఏదిఏమైనా నేషనల్ టైగర్స్ కన్జర్వేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా సంస్థ ప్రతినిధులు ఇప్పటికైనా స్పందించి నల్లమలలో పెద్దపులుల మరణాల నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పెద్దపులుల సంరక్షణకు కృషి



ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ పరిధిలో పెద్దపులుల సంరక్షణకు అన్ని విధాలుగా కృషి చేస్తున్నాం. అటవీ ఉద్యోగులు, సిబ్బంది నిరంతరం గస్తీ చర్యలు చేపడుతున్నారు. అడవుల్లో ప్రతిరోజు ట్రాకర్స్ పర్యటించి వన్యప్రాణుల సంరక్షణపై దృష్టి సారిస్తున్నాయి. అయితే మారుమూల ప్రదేశాల్లో పులి మరణించి ఉండటం వల్ల గుర్తించడం ఆలస్యమైంది. పులి మృతికి గల కారణాలను ల్యాబ్ రిపోర్టులు రాగానే వెల్లడిస్తాం. పులుల మరణాలపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం.

- ఎ.సాయిబాబా, డిప్యూటీ డైరెక్టర్, ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్

8,9 తేదీల్లో కర్నూలు మీదుగా తిరుపతికి రెండు ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్ సిటీ, మే 1(ఆంధ్రజ్యోతి): వేసవి రద్దీ నేపథ్యంలో చర్లపల్లి-తిరుపతి మధ్య కర్నూలు మీదుగా ఈ నెల 8,9 తేదీల్లో రెండు ప్రత్యేక రైళ్లు నడపాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. 8న చర్లపల్లి నుంచి తిరుపతికి రాత్రి 9:35 గంటలకు 07259 ప్రత్యేకరైలు, ఈ నెల 9న తిరుపతి నుంచి చర్లపల్లికి 07260 ప్రత్యేకరైలు నడపనున్నట్లు సీపీఆర్‌ఓ శ్రీధర్ తెలిపారు. మధ్యలో మల్కాజిగిరి, కాచిగూడ, షాద్‌నగర్, జడ్చెర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల, కర్నూలు, డోన్, తాడిపత్రి, ఎర్రగుంట్ల, కడప,రాజంపేట, రేణిగుంట స్టేషన్లలో ఆగుతాయని తెలిపారు.

హైవే పనులను పూర్తి చేయండి

కలెక్టర్ రంజిత్ బాషా



నేషనల్ హైవే విస్తరణ పనులను తనిఖీ చేస్తున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, మే 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 340-సీలో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం నంద్యాల చెక్‌పోస్టు నుంచి గార్గేయపురం వరకు జరుగుతున్న ఎన్‌హెచ్ 340-సీ నేషనల్ హైవే విస్తరణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల చెక్‌పోస్టు నుంచి గార్గేయపురం వరకు జరుగుతున్న ఎన్‌హెచ్ 340-సీకి సంబంధించి ఎల్లమ్మ దేవాలయం, మిలటరీ కాలనీ, గార్గేయపురం చెరువు వద్ద పనులు పెండింగ్ ఉన్నాయన్నారు. భూసేకరణ పూర్తి చేసి నెల రోజులైనా ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయని ఎన్‌హెచ్ అధికారులను ప్రశ్నించారు. కాంట్రాక్టర్లను పిలిపించి వారితో మాట్లాడి పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ పీడీ పద్మజ, ఆర్‌అండ్‌బీ ఈఈ శంకర్‌రెడ్డి, ఆర్డీఓ సందీప్ కుమార్, నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సునీతాబాయి తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

కర్నూలు అర్బన్, మే 1(ఆంధ్రజ్యోతి): నగరంలోని సి.క్యాంప్ సెంటర్‌లోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారి సోమశేఖరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌సీఎల్ టెక్ బీ ప్రోగ్రాం కంపెనీ ఆధ్వర్యంలో ఎంపీసీ, ఎంఈసీ, మ్యాథ్స్ సబ్జెక్టు ఉన్న ఒకేషనల్ కోర్సుల్లో 75 శాతం, మ్యాథ్స్ సబ్జెక్టులో 60 శాతం మార్కులతో పాసైన 2024, 2025 బ్యాచ్ విద్యార్థులు ఇంటర్వ్యూకు కావాలన్నారు. 17 ఏళ్లు పైబడి, ఆసక్తి గల అభ్యర్థులు ముందుగానే ఆన్‌లైన్‌లో గానీ, కార్యాలయానికి చేరుకొని గానీ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

కర్నూలు లీగల్, మే 1 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా డోన్ పట్టణంలో పాత కక్షలు మనసులో ఉంచుకుని చేసిన హత్యపై నేరం రుజువు కావడంతో ఇద్దరు నిందితులైన నగేష్, నాయకంటి బాలమద్దికి జీవిత ఖైదు విధిస్తూ కర్నూలు ప్రిన్సిపల్ సెషన్స్ న్యాయాధికారి జి.కబర్ది గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. డోన్ మండలం ఎస్.గుండాల గ్రామానికి చెందిన హతుడు బోయ గుమిడిరాళ్ల కౌలుట్ల గ్రామపెద్దగా పనిచేసి గ్రామంలో పేరు గడించారు. 2016లో మే 15న హతుడు తన స్వగ్రామం నుంచి డోన్‌కు పనిమీద వచ్చాడు. పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలోని ఓ కాలువలో కౌలుట్ల మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. హతుడి కుమారుడు కాంతారావుకు ఫోన్‌చేసి సమాచారం అందించారు. దీంతో హతుడి కుమారుడు, కుటుంబ సభ్యులు డోన్ వెళ్లి హతుడిని గుర్తించి డోన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేశారు. ఆ తర్వాత డోన్ మండలం కొత్రాయి గ్రామానికి చెందిన మాదిగ నగేష్, గుమ్మకొండ గ్రామానికి చెందిన నాయకంటి బాలమద్దిలపై కేసును విచారించి వీరే కౌలుట్లను హత్యచేశారని నిర్ధారించారు. గ్రామంలో కౌలుట్ల ఎదుగుదలను ఓర్చుకోలేక నిందితులు ఈ హత్యకు పాల్పడినట్లు డోన్ పోలీసులు తమ విచారణలో కనుగొని కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. నిందితులపై నేరం రుజువు కావడంతో యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.వెంకటరెడ్డి వాదించారు.

తీర్పునిచ్చిన కర్నూలు జిల్లా న్యాయాధికారి జి. కబర్ది



యావజ్జీవ శిక్ష పడిన ఇద్దరు నిందితులు

పోలీసులను అభినందించిన నంద్యాల ఎస్పీ

కౌలుట్ల హత్య కేసులో పోలీసులు దర్యాప్తులోనూ, సాక్ష్యాలు సేకరించడంలోనూ, సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నిందితులపై శిక్షపడేలా కృషిచేసిన పోలీసు అధికారులను నంద్యాల ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా అభినందించారు. పోలీసులు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో కృషి చేసినందుకు డోన్ డీఎస్పీ శ్రీనివాసులు, విచారణాధికారి, జిల్లా కోర్టు పీపీ ఎం.వెంకటరెడ్డిని అభినందించారు.

హత్య కేసులో ఎనిమిది మంది అరెస్టు

డీఎస్పీ బాబుప్రసాద్

కర్నూలు క్రైం, మే 1 (ఆంధ్రజ్యోతి): కోడుమూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో గత నెల 27వ తేదీ పులకుర్తి గ్రామంలో జరిగిన నడిపి రంగడు హత్యకేసులో ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ బాబుప్రసాద్ తెలిపారు. గురువారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పులకుర్తి గ్రామానికి చెందిన హతుడు రంగడు మేనల్లుడైన సురేష్‌కు బోయ మునిస్వామికి మధ్య ఓ యువతి విషయంలో తరుచూ గొడవలు జరిగాయి. దీంతో పాటు ఇదే గ్రామానికి చెందిన బోయ దస్తగిరి, బోయ నరసింహలుకు మధ్య తిరునాళ్లలో ఘర్షణ జరిగింది. ఈవిషయంలో నడిపి రంగడు, సురేష్ ఇద్దరూ నరసింహలుకు మద్దతు ఇవ్వగా.. మునిస్వామి దస్తగిరికి సపోర్టు చేశాడు. దీంతో సురేష్, మునిస్వామిల మధ్య వైరం మరింత పెరిగింది. మునిస్వామిపై దొంగ అని, చాలా కేసులు ఉన్నాయని సురేష్ అవమానించాడు. దీంతో మునిస్వామి సురేష్‌పై కక్ష పెంచుకొని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. గతనెల 26వ తేదీ రాత్రి మునిస్వామి, అతని స్నేహితులు మహేష్ మద్యం సేవించి సురేష్ వద్దకు వెళ్లారు. సురేష్ కనిపించకపోవడంతో అతడి ట్రాక్టర్ డ్రైవర్ సోమేష్‌ను కొట్టారు. 27వ తేదీ ఉదయం సోమేష్ ఈ విషయాన్ని రంగడు, సురేష్‌లకు చెప్పాడు. దీంతో మరోసారి వారి మధ్య తగాదా జరిగింది. ఈ ఘర్షణలో నడిపి రంగడు, సురేష్‌లపై కట్టెలతో, రాళ్లతో దాడి చేశారు. ఈ ఘర్షణలో రంగడు తీవ్రంగా గాయపడి 28వ తేదీన మృతి చెందాడు. కేసు నమోదు చేసిన కోడుమూరు సీఐ చిరంజీవి, ఎస్‌ఐ స్వామి, గూడూరు ఎస్‌ఐ తిమ్మయ్య నిందితులు మునిస్వామి, బోయ శివ, బోయ బజారి, బోయ రాకేష్, బోయ సురేష్, కల్లపరి నాయుడు, బోయ నాగరాజు, బంగి తిమ్మప్పను అరెస్టు చేశారు. అనంతరం కర్నూలు డీఎస్పీ ఎదుట హాజరుపరిచారు. పోలీసులు నిందితుల నుంచి రాడ్లు, మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బాబు ప్రసాద్

ఈత కొలనులో బాలుడి మృతి

● రెప్పపాటులో విషాదం ● కుప్పకూలిన కుటుంబం

ఆదోని రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి) : అమ్మా స్విమింగ్ పూల్‌కు వెళ్దాం.. నేను ఈత నేర్చుకుంటా.. బడి కూడా లేదు కదమ్మా.. నాన్నకు చెప్పమ్మా.. అని ఆ బాలుడు మారాం చేశాడు. ఆ తల్లిదండ్రులు ముగ్గురు కుమారులతో కలిసి ఇస్వీ రహదారిలో ఉన్న స్విమింగ్ పూల్‌కు వెళ్లారు. అక్కడ అనుకోకుండా జరిగిన ప్రమాదాల్లో బాలుడు క్షణాల్లో నీటి కొలనులో మృతి చెందాడు. ఈ ఘటన గురువారం జరిగింది. ఆదోని పట్టణం ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్న రవి, రీటా దంపతులకు ముగ్గురు మగ పిల్లలు. రవి కోసిగిలోని ఓ ఫైనాన్స్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం పెద్ద కొడుకు ప్రిన్స్(5) స్విమ్మింగ్ పూల్‌కు వెళ్దామని మారాం చేశాడు. దీంతో ఆ దంపతులు ముగ్గురు చిన్నారులను తీసుకొని ఇస్వీ రహదారిలో ఉన్న ఈడెన్ గార్డెన్ స్విమింగ్ పూల్‌కు వెళ్లారు. అక్కడ ముందుగా కుటుంబ సభ్యులు ఫొటోలు తీసుకున్నారు. తరువాత ఇద్దరు చిన్నారులను పట్టుకొని తల్లి ఒకవైపు ఉండగా, పెద్ద కొడుకు ప్రిన్స్‌తో కలిసి తండ్రి స్విమింగ్ పూల్ వద్దకు వెళ్లాడు. క్షణాల్లో పక్కన ఉన్న ప్రిన్స్ స్విమింగ్ పూల్ నీటిలో తేలాడుతూ కనిపించాడు. అక్కడున్న వారంతా కేకలు వేయడంతో పరుగున వెళ్లి తండ్రి నీటిలో నుంచి కొడుకును బయటికి తీశాడు. అప్పటికే ఆ బాలుడు మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటి వరకు తమ బిడ్డ ఆనందంగా గడిపిన క్షణాలను గుర్తు చేసుకొని తల్లిదండ్రులు బోరున విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



ప్రమాదానికి కొన్ని నిమిషాల ముందు స్విమింగ్ పూల్‌లో ఫొటో దిగిన బాలుడు

స్విమింగ్ పూల్‌కు అనుమతి ఉందా?

బాలుడి మరణానికి కారణమైన స్విమింగ్ పూల్‌కు అనుమతులు ఉన్నాయా? ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారా? ట్రైనర్ ఉన్నారా లేదా? అనుమతి లేకుండా నిర్వహిస్తున్న స్విమింగ్ పూల్ యజమానులపై చర్యలు తీసుకోవాలి.

- కునిగిరి నీలకంఠ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

వామ్మో... ఎండలు..!



నంద్యాల ఎడ్యుకేషన్, మే 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, నంద్యాల జిల్లాల్లో గురువారం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కర్నూలు నగరంలో అత్యధికంగా 42.15 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్లు వాతావరణ సంస్థ అధికారులు వెల్లడించారు. ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదైన ప్రాంతాలు ఇలా...

కర్నూలు జిల్లా:

మండలం	డిగ్రీల సెల్సియస్
కర్నూలు	42.15
కౌతాళం	41.0
దేవనకొండ	40.91
కోడుమూరు	40.7,
హోళగుంద	40.5
పెద్దకడబూరు	40.29
కోసిగి	40.09
ఆలూరు	40.0
మంత్రాలయం	39.94
ఎమ్మిగనూరు	39.79
వెల్దుర్తి	39.73
ఆదోని	39.72
కోడుమూరు	39.7
సి.బెళగల్	39.5

నంద్యాల జిల్లా:

మండలం	డిగ్రీల సెల్సియస్
పాములపాడు	41.64
అవుకు	41.47
గోస్పాడు	41.47
రుద్రవరం	41.41
బండిఆత్మకూరు	41.4
దొర్నిపాడు	41.29
మహానంది	41.19
పాణ్యం	40.79
ఆళ్లగడ్డ	40.57
సంజామల	40.0
కోవెలకుంట్ల	40.21
సంజామల	40.0
గడివేముల	39.79
చాగలమర్రి	39.68
డోన్	39.64
శిరివెళ్ల	39.53
నందికొట్కూరు	39.47
నంద్యాల	39.32

షర్మిల గృహ నిర్బంధం సరికాదు

నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్



మాట్లాడుతున్న నంద్యాల కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడు జే.లక్ష్మీనరసింహాయాదవ్

కల్లూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ తీరును విమర్శించిన ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలను గృహ నిర్బంధం చేయడం ఏమాత్రం సరికాదని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యుడు జె.లక్ష్మీనరసింహ యాదవ్ పేర్కొన్నారు. వైఎస్ షర్మిలపై కోడిగుడ్లు, గాజుపెంకులతో దాడిచేసేందుకు యత్నించిన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం నంద్యాల చెక్‌పోస్టులోని దామోదరం సంజీవయ్య భవన్ ఆయన విలేకరులతో మాట్లాడారు. 2015 ఉద్దండరాయుని పాలెంలో ప్రధాని మోదీ శంకుస్థాపన చేసిన ప్రాంతంలో మళ్లీ మే 2న భూమిపూజ చేయడమంటే కేంద్ర ప్రభుత్వ మోసపూరిత ధోరణి తేటతెల్లం అయినట్లేనని ఆరోపించారు. బీజేపీ, టీడీపీ, జనసేన స్వలాభం కోసమే రాష్ట్రంలో స్వేచ్ఛాభావాలకు విఘాతం కలిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్‌సిక్స్ పథకాల అమలులో ఎన్డీయే ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. చిత్తశుద్ధి ఉంటే గత పది సంవత్సరాల్లో రాష్ట్రంలో సాధించిన ప్రగతిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ కింద రూ.24,500 కోట్లు వచ్చి ఉంటే వెనకబడిన జిల్లాలో సాగు, తాగునీటికి సంబంధించిన ప్రాజెక్టులు పూర్తి అయ్యేవన్నారు. బీజేపీ ప్రభుత్వం వల్లే రాష్ట్రానికి నిధులు రాకుండాపోయాయన్నారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో కర్ణాటక మాజీ సీఎం



యడ్యూరప్పకు జ్ఞాపికను ఇస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, మే 1(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడ్యూరప్ప, కుమారుడు శివమొగ్గ ఎంపీ రాఘవేంద్ర కుటుంబ సమేతంగా గురువారం రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు. బుధవారం రాత్రి మంత్రాలయంకు వచ్చి పద్మనాభతీర్థ గెస్ట్ హౌస్‌లో బసచేశారు. మహా ముఖద్వారం వద్ద వీరికి మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు సురేష్ కోణాపూర్, వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తి, సీఐ రామాంజులు, ఎస్‌ఐ శివాంజల్ ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేష వస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. తన మనవడి వివాహానికి రావాలని పీఠాధిపతిని ఆహ్వానించారు. సూపరింటెండెంట్ అనంతపురాణిక్, విజయేంద్రాచార్, వ్యాసరాజాచార్, రాఘవేంద్రపురాణిక్, నరసింహదేశాయ్, ద్వారపాలక అనంతస్వామి, తంబిస్వామి, వాజేంద్రాచార్, రాఘవేంద్రాచార్, పవన్‌ఆచార్, రంగస్వామి, వరదేంద్రాచార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు మంత్రి మే డే శుభాకాంక్షలు



బనగానపల్లె, మే 1 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మికులకు గురువారం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మే డే శుభాకాంక్షలు తెలియజేశారు. కార్మిక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం 11 ఎంఎస్‌ఎంఈ పార్కులను ప్రారంభించిందని మంత్రి తెలిపారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరు నియోజకవర్గంలో సీఎం చంద్రబాబునాయుడు ఎంఎస్‌ఎంఈ పార్కును ప్రారంభించడం సంతోషకరమైన విషయమన్నారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో కీలక భూమిక పోషిస్తున్న కార్మికుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. ఏపీ భవిష్యత్ రాజధాని అమరావతి పునర్నిర్మాణంలో కార్మికుల పాత్ర కీలకమన్నారు. కార్మికుల జీవన ప్రమాణాలు పెరగడానికి, వారి జీవితాల్లో సరికొత్త వెలుగులు ప్రసరించాలని మంత్రి ఆకాంక్షించారు. రాష్ట్రంలోని కార్మికుల ఐక్యంగా ఉండి రాష్ట్ర పురోభివృద్ధిలో పాలు పంచుకోవాలని మంత్రి కోరారు.

రహదారుల అభివృద్ధికి రూ.400 కోట్లు

రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల రహదారుల అభివృద్ధికి రూ.400 కోట్లు కేటాయించినట్లు రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి తెలిపారు. నాబార్డు కింద గ్రామీణ రహదారుల అభివృద్ధికి రూ.400 కోట్లతో 192 అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. నాబార్డు నిధుల కింద 1246 కిలోమీటర్ల ప్రధాన రహదారులను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. వచ్చే 5 ఏళ్లలో రాష్ట్రంలోని రోడ్లకు పూర్వవైభవం తీసుకువస్తామని మంత్రి వెల్లడించారు.

రేపు హెల్త్ అసిస్టెంట్ల కౌన్సెలింగ్

45 మందితో సీనియారిటీ జాబితా విడుదల

కర్నూలు హస్పిటల్, మే 1(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో పని చేస్తున్న హెల్త్ అసిస్టెంట్లు (మేల్) పని సర్దుబాటు కౌన్సెలింగ్‌ను ఈ నెల 3వ తేదీ జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ తెలిపారు. ఫ్యామిలి డాక్టర్ ప్రోగ్రాంలో విధులు నిర్వహిస్తున్న హెల్త్ అసిస్టెంట్ (మేల్) ఉద్యోగుల సేవలను మలేరియా, డెంగీ ప్రభావిత ప్రాంతాల్లో వినియోగించుకునేలా వారిని సర్దుబాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా కర్నూలు జిల్లాకు చెందిన 45 మంది హెల్త్ అసిస్టెంట్లు (మేల్) సీనియారిటీ జాబితాను విడుదల చేశామన్నారు. ఇదిలా ఉండగా కౌన్సెలింగ్‌కు డీఎంహెచ్‌ఓ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. కన్వీనర్‌గా జిల్లా మలేరియా అధికారి నూకరాజు, సభ్యులుగా ఏఓ అరుణ ఉంటారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే హెల్త్ అసిస్టెంట్లు పీహెచ్‌సీ వైద్యాధికారుల అనుమతి తీసుకుని రావాలని డీఎంహెచ్‌ఓ ఆదేశించారు.

తండ్రి మందలించడంతో యువకుడి ఆత్మహత్య

ఆదోని రూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): బాగా చదువుకోవాలని తండ్రి మందలించడంతో ఉరుకుందు(20) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదోని మండలం బల్లేకల్లు గ్రామానికి చెందిన యువకుడు ఉరుకుందు అటు చదువుకు దూరమై, ఇటు పనులకు వెళ్లకుండా ఉండడంతో తండ్రి తిక్కయ్య గురువారం మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన యువకుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెద్దతుంబళం ఎస్‌ఐ మహేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





ఆటపాటలతో హాయిగా...

- నీతికథలు, పుస్తక పఠనాలు, ఉపన్యాసాలు..
- విద్యార్థులకు సమ్మర్ క్యాంపు





నిత్యం పుస్తకాలు, ట్యూషన్లతో కుస్తీ పట్టే విద్యార్థులకు ప్రభుత్వం సమ్మర్ క్యాంపు నిర్వహిస్తోంది. ఆలూరు పట్టణంలోని గ్రంథాలయంలో రోజూ 6 నుంచి 10 పదో తరగతి విద్యార్థులకు చెస్, క్యారమ్స్‌తో పాటు నృత్యం, ఉపన్యాసం తదితర అంశాలలో శిక్షణ ఇస్తున్నారు.

ఆలూరు, మే1 (ఆంధ్రజ్యోతి): వేసవిలో విద్యార్థులు సమ్మర్ క్యాంపులో ఆటపాటలతో హాయిగా గడిపేస్తున్నారు. ఆలూరు పట్టణంలోని గ్రంథాలయంలో 50 వరకు పిల్లలు వస్తున్నారు. రోజూ ఆంగ్ల సంభాషణ, చిత్రలేఖనం, రంగులు వేయడం, కాగితంతో కళారూపాలు తయారు చేయడం, సంగీతం, నృత్యం, బొమ్మల తయారీ, నటనతో పాటు, యోగా, క్యారమ్స్, చెస్ ఇలా ఏకాగ్రతను పెంపొందించేలా శిక్షణ ఇస్తున్నారు.

జూన్ 6వరకు శిబిరం

బాలల్లో పఠనాసక్తి పెంపు, వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు ప్రభుత్వం గ్రంథాలయాలను వేదికగా చేసింది. జూన్ 6వ తేదీ వరకు వేసవి శిబిరాలు నిర్వహించాలని ఆదేశించింది. ఆరు నుంచి పదో తరగతి విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికి తీసేందుకు ఇవి ఉపయోగపడుతున్నాయి. క్యారమ్స్, చెస్, ఆటలపోటీలు, డ్యాన్సులతో విద్యార్థులు ఉత్సాహంగా గడుపుతున్నారు.

ఇవీ కార్యక్రమాలు

'చదవడం మాకిష్టం' కార్యక్రమంలో భాగంగా పుస్తక పఠనం చేయిస్తారు. అనంతరం 20 నిమిషాల పాటు పుస్తక సమీక్ష చేస్తారు. ఉదయం 8:00 గంటల నుంచి 11.30 గంటల వరకు కథలు వినిపిసారు. పిల్లలతో కథలు కూడా చెప్పిస్తారు.

నీతి కథలు చెబుతున్నారు



సమ్మర్ క్యాంపులో మాకు రోజూ నీతికథలు చెబుతు న్నారు. మంచిమంచి కథల పుస్తకాలు చదివిస్తున్నారు. నాకు మాట్లాడే అవకాశం ఇచ్చారు, దీతో స్టేజ్ ఫియర్ పోయింది.
- ఇందు, విద్యార్థిని, ఆలూరు

ఎంజాయ్ చేస్తున్నాం



సెలవుల్లో గ్రంథాలయంలో నిర్వహిస్తున్న క్యాంపులో స్నేహితులతో మేము ఎంజాయ్ చేస్తున్నాం. వివిధ అంశాల్లో శిక్షణ ఇవ్వడమేగాక ఆట, పాటలు నేర్పుతున్నారు. - గాయత్రి, ఆలూరు

వివిధ అంశాలపై శిక్షణ



వేసవిశిబిరంలో విద్యార్థులకు వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తున్నాం. పుస్తక పఠనంతో చదువుతో ఆసక్తితోపాటు సృజనాత్మకతను వెలికితీయవచ్చు. దీంతో మెదడు చురుగ్గా పనిచేస్తుంది. - విజయభాస్కర్, గ్రంథాలయాధికారి, ఆలూరు

ఆర్డీటీ సేవలను కొనసాగించాలి

మద్దికెర, మే 1 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సేవా సంస్థ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు(ఆర్డీటీ) సేవలను కొనసాగించాలని వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్లు, ఆపద్బాంధవ సేవా సమితి అధ్యక్షుడు చొక్కా సునీల్‌కుమార్, మండల సీపీఎం కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం వేర్వేరుగా మాట్లాడుతూ ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ ఇవ్వకుండా ఆంక్షలు విధించడం అన్యాయమన్నారు. ఆర్డీటీకి నిధులు రాకుంటే కర్నూలు, అనంతపురం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పేద ప్రజలు నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేవారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి ఒత్తిడి తేవాలని కోరారు.

చంద్రబాబుతోనే వృద్ధులకు న్యాయం



కొత్తపేటలో పింఛన్ పంపిణీ చేస్తున్న వీరభద్రగౌడ్

దేవనకొండ, మే 1 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే వృద్ధులకు న్యాయం చేకూరిందని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ అన్నారు. గురువారం కొత్తపేటలో వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. పింఛన్లు పెంచుతామని గత ప్రభుత్వం ఐదేళ్లపాటు మోసం చేసిందన్నారు. సీఎం చంద్రబాబు కృషితో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందని, హామీలను ఒక్కొటిగా నెరవేరుస్తున్నామన్నారు. నాయకులు బడిగింజల రంగన్న, సుభాన్, వెంకటస్వామి గౌడ్, వీరేష్, సర్పంచు భాస్కర్, రామాంజినేయులు, చాంద్‌బాషా, ఎంపీడీవో బీవీ రమణరావు తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌రెడ్డికి ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు

వెల్దుర్తి టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకుడు శంకర్‌రెడ్డి 71వ జయంతి గురువారం నిర్వహించారు. పార్టీ కన్వీనర్ బలరాం గౌడ్, రమాకాంత్ రెడ్డి, ఎల్.బండ విజయ్ మోహన్ రెడ్డి, రామళ్లకోట రామకృష్ణాచారి, గుంటుపల్లె ఈదుల వెంకటరాముడు కేక్ కట్ చేశారు. ముందుగా శంకర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సన్మానించి, నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. తెలుగుయువత అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్ కలగొట్ల రామకృష్ణ, పుల్లగుమ్మి వెంకటేశ్వరరెడ్డి, రామళ్లకోట రామస్వామి, చంద్రన్న, రామచంద్రనాయుడు, బజారు, సూదేపల్లె రామచంద్రుడు, నార్లాపురం జయరాముడు, శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమరావతికి తరలిన ప్రజలు, నాయకులు



బయలుదేరివెళ్తున్న టీడీపీ నాయకులు, ప్రజలు

తుగ్గలి, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ చేతుల మీదుగా అమరావతి శంకుస్థాపన చేస్తున్నందున పెద్ద ఎత్తున ప్రజలు అమరావతికి బయలుదేరినట్లు తహసీల్దార్ రమాదేవి, టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, మాజీ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ అన్నారు. గురువారం తుగ్గలి నుంచి అమరావతికి బస్సును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకట్రాముడు, టీడీపీ నాయకులు వల్లె వెంకటేష్, డీలర్ తిమ్మప్ప, రాంపల్లి శ్రీను, సత్యప్రకాష్, ఓబులేసు తదితరులు ఉన్నారు.

పనికి తగ్గ కూలి

మద్దికెర, మే 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో పనులకు తగ్గ కూలి వస్తుందని ఏపీవో నర్సిరెడ్డి అన్నారు. గురువారం ఎం.అగ్రహారం, మద్దికెరలో పనులను పరిశీలించారు. ఎండలు మండిపోతున్నాయని కూలీలు ఉదయమే పనిలోకి వచ్చి త్వరగా ముగించుకోవాలని, రూ.300ల కూలీ అందేలా పని చేసుకోవాలని తెలిపారు. వేతనాలు ఇప్పటికే కూలీల ఖాతాల్లో జమ అయ్యాయన్నారు.

ఆటో బోల్తా.. నలుగురికి గాయాలు

తుగ్గలి, మే 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఏఎస్ కళాశాల సమీపంలో ఆటో బోల్తాపడి నలుగురికి గాయాలయ్యాయి. తుగ్గలి ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపిన మేరకు.. ఆటో తుగ్గలి నుంచి పత్తికొండకు వెళుతుండగా ఏఎస్ కళాశాల వద్ద బోల్తాపడింది. క్షతగాత్రులను పత్తికొండ వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు. క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



క్షతగాత్రులకు సాయం చేస్తున్న స్థానికులు

పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయం



పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న అధికారులు

ఆలూరు, మే1 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల సేవలు అభినందనీయమని మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ నగరూరు అరుణదేవి కొనియాడారు. గురువారం కార్యాలయంలో పారిశుధ్య కార్మికులను సన్మానించారు. పట్టణాన్ని శుభ్రంగా చేసేందుకు నిత్యం శ్రమిస్తున్నారన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బెంగళూరు కిషోర్, లక్ష్మణ్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావేదిక ద్వారా సమస్య పరిష్కారం



ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న ఎంపీడీవో వరలక్ష్మి

హాలహర్వి, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూళ్యం గ్రామానికి చెందిన గురుమూర్తి తన పొలంలోకి మురుగు వస్తోందని ప్రజావేదికలో ఎంపీడీవో వరలక్ష్మికి సోమవారం ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎంపీడీవో గురువారం ఈవోఆర్డీ రామాంజనేయులు, అధికారులతో కలిసి గ్రామానికి వెళ్లి పరిశీలించి, మురుగు పొలంలోకి రాకుండా వాగులో వెళ్లేలా చూడాలని ఇన్‌చార్జి ఈవోఆర్డీ, పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. మరోసారి సమస్య రాకుండా చూడాలని సూచించారు.

కలపరిలో వైద్య శిబిరం

ఆస్పరి, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలపరి గ్రామంలో వైద్యశిబిరం కొనసాగుతోంది. గురువారం ఈహెచ్‌సీ వైద్యురాలు దుర్గాబాయి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని, పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు.



రోగులను పరీక్షిస్తున్న డా.దుర్గాబాయి

అధైర్యపడొద్దు అండగా ఉంటా

- జడ్పీ మాజీ చైర్మన్ బత్తినకు సీఎం చంద్రబాబు హామీ



సీఎం చంద్రబాబుతో బత్తిన

పత్తికొండ, మే 1 (ఆంధ్రజ్యోతి): అధైర్యపడొద్దు అండగా ఉంటానని సీఎం చంద్రబాబు జడ్పీ మాజీ చైర్మన్ బత్తిన వెంకట రాముడుకు హామీ ఇచ్చారు. గురువారం అమరావతిలో బత్తిన, ఎస్సీసెల్ నాయకుడు వెంకటపతి సీఎంను కలిశారు. ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తున్నామని న్యాయం చేయాలని విన్నవించారు. స్పందించిన సీఎం అండగా ఉంటానని హామీ ఇచ్చినట్లు బత్తిన తెలిపారు.

రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్ తప్పనిసరి

ఆలూరు, మే1 (ఆంధ్రజ్యోతి): భూములు, ఇల్లు రిజిస్ట్రేషన్ చేయించుకోదలచినవారు ముందుగా స్లాట్ బుక్ చేసుకోవాలని ఆలూరు సబ్ రిజిస్ట్రార్ మల్లికార్జున తెలిపారు. గురువారం మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు స్లాట్ బుకింగ్ తప్పనిసరని, తమకు అనుకూల సమయం తేదీని వారే నిర్ణయించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఇకపై గంటల తరబడి వేచి ఉండాల్సిన అవసరం లేదన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

ఆలూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ కావడంతో ఆత్మహత్యాయత్నం చేసిన విద్యార్థి సిద్దార్థ్ (15)చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. వివరాలు.. పట్టణంలోని కోటవీధికి చెందిన శ్రీనివాసులు, దానమ్మ దంపతుల కుమారుడు సిద్దార్థ్ పదో తరగతి ఫలితాల్లో ఫెయిల్ అయ్యేడు. అవమానం భరించలేక గత నెల ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తల్లిదండ్రులు ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి అనంతరం మెరుగైన వైద్యం కోసం బళ్లారి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు.

భూసార పరీక్షలు చేయించుకోండి



మట్టి నమూనా సేకరిస్తున్న ఏవో

మద్దికెర, మే 1 (ఆంధ్రజ్యోతి): రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏవో రవి సూచించారు. గురువారం బురుజుల, మద్దికెర గ్రామాల్లో పొలాల్లో మట్టి నమూనాలను సేకరించారు. భూసార పరీక్షలను చేయించుకోవడం వల్ల రైతులు ఏయే పంటలను సాగు చేయవచ్చునో ఏ మేరకు ఎరువులు వినియోగించుకోవాలో తెలుసుకునే అవకాశం ఉందన్నారు. ఏఈవో జాకీర్, ఆనంద్ నాయక్ ఉన్నారు.

పాడి రైతులకు సబ్సిడీ దాణా

హాలహర్వి, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాడి రైతులకు సబ్సిడీ కింద పశువుల దాణా అందజేస్తామని పశువైద్యాధికారి అశోక్ తెలిపారు. గురువారం మాట్లాడుతూ రూ.500లు చెల్లించిన రైతుకు 50 కేజీల ప్రకారం పౌష్టికరమైన దాణా అందజేస్తామని, పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

92 శాతం పింఛన్ల పంపిణీ : కమిషనర్

ఆదోని టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో గురువారం 92శాతం పింఛన్లను పంపిణీ చేశామని మున్సిపల్ కమిషనర్ కృష్ణ అన్నారు. తెల్లవారుజాము 5గంటల నుంచి మున్సిపల్, సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీ ప్రారంభించారని తెలిపారు. పట్టణంలో 16,582మంది పింఛన్ దారులు న్నారని మిగతా వారికి శుక్రవారం ఉదయమే పంపిణీ చేస్తామని కమిషనర్ తెలిపారు.



పింఛన్ల పంపిణీని పర్యవేక్షిస్తున్న కమిషనర్ కృష్ణ

మూగ జీవాలకు ఊరట

- ఉపాధి నిధులతో నీటి తొట్లు



ఎం.అగ్రహారం గ్రామంలో నీరు తాగుతున్న మూగజీవాలు

మద్దికెర, మే 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధి నిధులతో నీటితొట్లు నిర్మించడంతో మూగజీవాలు ఊరట చెందుతున్నాయి. వేసవిలో తొట్లలోని నీరు తాగి దాహార్తి తీర్చుకుంటున్నాయి. మండలంలోని 8 పంచాయతీల్లో 8 నీటి తొట్టిలు నిర్మించాల్సి ఉంది. ఇప్పటికే ఏడు పూర్తి చేశారు. ఒక్కో తొట్టి నిర్మాణానికి రూ.15వేలు ఖర్చు చేస్తున్నారు. మరో తొట్టిని కూడా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని ఏపీవో నర్సిరెడ్డి తెలిపారు.

దేశంలో కుల గణన మోదీకే సాధ్యం



మలేకార్ శ్రీనివాస్

ఆదోనిటౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): దేశంలో కుల గణనను మోదీకే సాధ్యమైందని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మలేకార్ శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం మాట్లాడుతూ దశాబ్దాలుగా దేశాన్ని పాలించిన కాంగ్రెస్ కుల గణనను పట్టించుకోలేదని విమర్శించారు. ఖచ్చితమైన డేటా లేకపోవడంతో బీసీలు, ఇతర అణగారిన వర్గాలకు సంక్షేమ పథకాలు అందించడం సాధ్యం కాదన్నారు. 1931లో బ్రిటీష్ హయాంలో చేసిన కులగణన అనంతరం 94 సంవత్సరాల తరువాత మోదీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని తెలిపారు.

ప్రమాద ప్రయాణం

సరుకు రవాణా వాహనాల్లో ప్రయాణం ప్రమాదకరం. అందులోనూ ఇలా పరిమితికి మించి టాప్‌పై ప్రయాణం ఎంత ప్రమాదకరం. వెల్దుర్తి పట్టణంలో నిత్యం ఇలా ప్రయాణిస్తున్నారు. పాత బస్టాండ్‌లో కనిపించిన దృశ్యం ఇది. ఏ మాత్రం అదుపు తప్పినా అంతే..! పోలీసులు, రవాణా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. - వెల్దుర్తి



ఎర్రజెండా రెపరెపలు

- ఆదోని, పత్తికొండ, ఆలూరు నియోజకవర్గాల్లో మే డే వేడుకలు
- ర్యాలీ నిర్వహించిన కార్మికులు, వామపక్షాలు



ఆదోనిలో జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు



పత్తికొండలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర నాయకుడు రామచంద్రయ్య

ఆదోని అగ్రికల్చర్, మే 1 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఎర్ర జెండా రెపరెపలాడింది. గురువారం 135వ మేడే వేడుకలను పురస్కరించుకొని సీఐటీయూ నాయకులు జెండాను ఆవిష్కరించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు ఈరన్న, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశులు, అంగన్‌వాడి జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమ్మ, సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, గోపాల్, ఉపాధ్యక్షుడు లక్ష్మన్న జెండాను ఆవిష్కరించారు. కార్మికులు ప్రాణత్యాగాలు చేసి తమ హక్కులను సాధించుకున్నారన్నారు. కాగా ఆదోని ఆర్టీసీ డిపో మేనేజర్ రఫి మే డే నిర్వహించుకునేందుకు అనుమతి ఇవ్వకపోవడంతో కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐఎఫ్‌టీయూ నాయకులు భీమాస్ సర్కిల్ నుంచి ర్యాలీ చేపట్టారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వెంకప్ప, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యదర్శి మల్లికార్జున జెండాను ఆవిష్కరించారు.

కార్మిక హక్కును కాలరాస్తున్న మోదీ : రామచంద్రయ్య

పత్తికొండ టౌన్: ఎన్నో పోరాటాలతో సాధించుకున్న కార్మికుల హక్కులను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కాలరాస్తోందని సీపీఐ కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య అన్నారు. గురువారం 139వ మేడే పురస్కరించుకుని స్థానిక ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్అండ్‌బీ గెస్టు హౌస్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కళాకారులు విప్లవ గీతాలు ఆలపించారు. కార్మికులు అనంతరం అంబేడ్కర్ సర్కిల్‌లో జరిగిన బహిరంగ సభలో రామచంద్రయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడా పారిశ్రామిక వేత్తలకు ఊడిగం చేస్తూ కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు నెట్టికంటయ్య, డిప్యూటీ కార్యదర్శి కృష్ణయ్య సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నబీరసూల్, రాజాసాహెబ్, కారుమంచి పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, తుగ్గలి కార్యదర్శి సుల్తాన్, గురుదాసు, కారన్న, ఏఐటీయుసీ తాలుకా కార్యదర్శి రంగన్న, నాయకులు రాజప్ప, మాదన్న, సిద్దలింగప్ప, గుండుబాషా, మాదన్న పాల్గొన్నారు.

- కార్మిక హక్కులకై పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ పిలుపునిచ్చారు. గురువారం సీఐటీయు ఆధ్వర్యంలో మేడే నిర్వహించారు. రంగారెడ్డి, దస్తగిరి, గోపాల్ పాల్గొన్నారు.

ఆదోని రూరల్: ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు జెండాను ఆవిష్కరించారు.

మద్దికెర: మండలంలోని మద్దికెర, ఎం.అగ్రహారం, పెరవలి గ్రామాల్లో మే డే వేడుకలను నిర్వహించారు. ఏఐటీయూసీ, సీఐటీయూ, హమాలీ, ఆటో కార్మికుల ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా మండల సీపీఐ కార్యదర్శి నాగరాజు, పట్టణ టీడీపీ అధ్యక్షులు గడ్డం రామాంజులు, బెల్దార్ సంఘం నాయకులు రాముడు, శేఖర్, రంగస్వామి మాట్లాడుతూ కార్మికుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు తీసుకుని రావాలన్నారు.

ఆస్పరి: మండలంలో ఏఐటీయూసీ, సీఐటీయూ, కార్మిక అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో గురువారం మేడే నిర్వహించారు. ఆస్పరితోపాటు కైరుప్పల, బిల్లేకల్ గ్రామాల్లో ఏఐటీయూసీ సీపీఐ జిల్లా సభ్యుడు నాగేంద్రయ్య, ఏఐటీయూసీ తాలుకా అధ్యక్షుడు కృష్ణమూర్తి జెండాను ఆవిష్కరించారు. హనుమంతప్ప, బాలకృష్ణ, ఎలక్ట్రిసిటీ 1104 యూనియన్ నాయకులు గోపాల్‌రెడ్డి, శేషప్ప, రవి, తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి: జొన్నగిరి కూడలిలో మేడే పురస్కరించుకుని సీపీఐ నాయకులు నబీ రసూల్, సుల్తాన్‌లు జెండా ఆవిష్కరించారు. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆలూరు: కార్మిక హక్కుల కోసం పోరాడాలని సీపీఐ నాయకుడు భూపేష్ పిలుపునిచ్చారు. గురువారం మే డే సందర్భంగా సీఐటీయూ కార్యాలయం వద్ద సీపీఐ మండల కార్యదర్శి రామాంజనేయులు జెండాను ఆవిష్కరించారు. కార్మికుల, అసంఘటిత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. గోపాల్, రంగన్న, చంద్రకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. సీపీఎం నాయకుడు నారాయణ స్వామి జెండా ఎగురవేశారు. షాకీర్, కృష్ణ, షైన పాల్గొన్నారు.

వెల్దుర్తి టౌన్: సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం 139వ మే డే వేడుకలను మండల అధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు మారెన్న, చిన్న ఏసు ఆధ్వర్యంలో నిర్వహించారు. మోటార్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో మాజీ ఎంపీపీ బొమ్మన దశరథరామిరెడ్డి జెండాను ఆవిష్కరించారు. బజార్ హమాలీ యూనియన్ కార్యాలయం వద్ద సీఐటీయూ జిల్లా కార్యదర్శి జే.నాగేశ్వరరావు జెండాను ఆవిష్కరించారు. పాత బస్టాండులోని బజార్ హమాలీ యూనియన్ సీఐటీయూ జెండాను పెద్ద ఏసు, న్యూబస్టాండు, రామళ్లకోట మోటారు వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ ఆవిష్కరించారు.

దేవనకొండ: కార్మిక, కర్షకుల హక్కుల సాధనకు పోరుబాట పట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వీరశేఖర్, ఆనంద్‌బాబు, సీపీఐ నాయకులు మద్దిలేటిశెట్టి, నర్సారావ్ కార్మికులకు పిలుపునిచ్చారు. తెర్నేకల్, పి.కోట కొండలో ఆవిష్కరించారు. ఏఐటీయూసీ కార్యాలయం వద్ద సీపీఐ వంశీనాథ్ అన్నదానం చేశారు.

జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు చిన్నభోంపల్లి విద్యార్థి ఎంపిక

● ఆంధ్రప్రదేశ్ జట్టుకు కెప్టెన్‌గా కొలిమి వీరేష్



కోసిగి, మే 1 (ఆంధ్రజ్యోతి): 68వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి కెప్టెన్‌గా కోసిగి మండలం చిన్నభోంపల్లి గ్రామానికి చెందిన కొలిమి వీరేష్ ఎంపికైనట్లు అసోసియేషన్ చైర్మన్ పుల్లాల నాగిరెడ్డి తెలిపారు. ఏప్రిల్ 29 నుంచి మే 3వ తేదీ వరకు ఢిల్లీలో జరుగు 68వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ తరుపున ఆంధ్రప్రదేశ్ కెప్టెన్‌గా కొలిమి వీరేష్ ఎంపిక కావడం పట్ల జిల్లా క్రీడాకారుల సంఘం నాయకులు,కోసిగి మండ క్రీడాకారులు, గ్రామస్థులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు. కోసిగి మండలం నుంచి జాతీయ స్థాయి పోటీల్లో ఢిల్లీలో రాష్ట్రానికి కెప్టెన్‌గా ప్రాతినిధ్యం వహించడంతో కోసిగి మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కోసిగికి చేరిన పాఠ్య పుస్తకాలు

కోసిగి, మే 1 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యను బలోపేతం చేయడంలో భాగంగా తరగతుల ప్రారంభానికి సుమారు నలభై రోజుల ముందే కోసిగి మండలానికి ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు సుమారు 46,870 పాఠ్య పుస్తకాలు మూడు ఆర్టీసీ బస్సుల్లో కర్నూలు నుంచి కోసిగికి చేరినట్లు శోభారాణి (ఎంఈవో-2) తెలిపారు. గురువారం కోసిగిలోని బాలుర ఉన్నత పాఠశాలలోని తరగతి గదులలో పాఠ్య పుస్తకాలను భద్రపరిచారు. పాఠ్య పుస్తకాలను శోభారాణి పరిశీలించారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు అన్ని పాఠ్యపుస్తకాలు చేరాయన్నారు. త్వరలోనే విద్యార్థులకు యూనిఫాం, షూస్, బ్యాగులు వస్తాయని తెలిపారు. పాఠశాలలు ఓపెన్ చేసిన రోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు స్కూల్ యూనిఫాం, బ్యాగ్ అందజేస్తామన్నారు.

తల్లి పాల ప్రాముఖ్యంపై అవగాహన కల్పించాలి

కోసిగి, మే 1 (ఆంధ్రజ్యోతి): తల్లి పాల ప్రాముఖ్యతపై ప్రతి తల్లికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత డాక్టర్లదేనని జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు అన్నారు. గురువారం కోసిగిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి గర్భిణులు, బాలింతలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ అప్పుడే పట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు తాపించడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్యసిబ్బందితో కలిసి గ్రామంలోని పలు ఇళ్లను సందర్శించి ఏయే ఆహార పదార్థాలు తీసుకుంటే తల్లికి పాలు సమృద్ధిగా ఉత్పత్తి అవుతాయో బాలింతలకు వివరించారు. పుట్టిన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు పట్టించాలన్నారు.. కార్యక్రమంలో డాక్టర్ రజిత, ప్రొజెక్షనిస్టు ఖలీల్, స్టాఫ్ నర్సు విద్యావతి ఉన్నారు.

ఎండలో వాహనదారుల కష్టాలు



ప్రధాన రోడ్డుపై అడ్డంగా నిలిపిన లారీ

కోసిగి, మే 1 (ఆంధ్రజ్యోతి): కోసిగిలో కిరాణ దుకాణాలకు లోడింగ్, అన్ లోడింగ్ చేసే లారీల తీరుతో ఇతర వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోజు కిరాణం లారీలు ప్రధాన రోడ్డుపై అడ్డంగా నిలిపి ఉంచడంతో ఆ దారులన్నీ ఇరుకుగా మారి కోసిగి ఆర్టీసీ బస్టాండు ప్రధాన రోడ్డు నిత్యం ట్రాఫిక్ జామ్‌తో అవుతోంది. గురువారం ఆర్టీసీ బస్టాండు ప్రధాన రోడ్డుపైన సుమారు గంట పాటు కిరాణం లారీ రోడ్డుపై అడ్డంగా ఉండటంతో అరగంట పాటు ట్రాఫిక్ జామ్ అయ్యి రోడ్డుకిరువైపులా వాహనదారులు ఎండలో ఇబ్బందులకు గురయ్యారు. ట్రాఫిక్ మళ్లించే పోలీసులు కూడా లేకపోవడంతో కిరాణం లారీ ఓనర్, పని చేసే వ్యక్తులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వాహనదారులపై బెదిరింపులకు పాల్పడ్డారు. ట్రాఫిక్ పోలీసులు కిరాణం లోడింగ్, అన్‌లోడింగ్ చేసే వాహనాలు రాత్రి నుంచి ఉదయం వేళల్లోనే అనుమతించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు



డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

గోనెగండ్ల, మే 1(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తామని గోనెగండ్ల సీఐ విజయభాస్కర్ అన్నారు. ఎమ్మిగనూరు, కర్నూలు ప్రధాన రహదారిలో గురువారం సాయంత్రం డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. వాహనాలను నిలిపి డ్రైవర్‌లను పరీక్షించి, ఐదు మందిపై కేసు నమోదు చేశారు. అలాగే 10 మందిపై ఈ-చలానా కేసులు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ, ఎమ్మిగనూరు డీఎస్పీ ఆదేశాల మేరకు ప్రతి రోజూ డ్రంక్‌అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

'అందుబాటులో యాంటీ స్నేక్ వ్యాక్సిన్ '

ఎమ్మిగనూరు, మే1(ఆంధ్రజ్యోతి): పాము కాటుకు విరుగుడు యాంటి స్నేక్ వ్యాక్సిన్ అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అందుబాటులో ఉందని జిల్లా నోడల్ ఆఫీసర్ డా రఘు తెలిపారు. గురువారం మండలంలోని ధైవందిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పార్లపల్లి గ్రామంలో జరుగుతున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని నోడల్ ఆఫీసర్ ఆకస్మికంగా తనిఖీచేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ వ్యవసాయ కూలీలు, ఉపాధిపనులు, మట్టిపనులు, ఇటుకల బట్టీల్లో పనిచేసే వారు పాము కాటుకు గురికాకుండా తగిన జాగ్రతలు తీసుకోవాలన్నారు. డా. అపర్ణ సాగర్, ఆరోగ్య కార్యకర్తలు సునీత, లక్ష్మణ్ , ఆశాకార్యకర్తలు, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

కిశోర బాలికల సమస్యలు పరిష్కరించాలి

నందవరం, మే 1(ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అంగన్‌వాడీ ప్రాజెక్టు ఆఫీసర్ సఫరున్నీ సా బేగం అన్నారు. మండల కేంద్రమైన నందవరంలో అంగన్‌వాడీ టీచర్‌లకు, వీవోఏలకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికల సమస్యలు, పరిష్కారాలపై ఒక్కరోజు శిక్షణ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఏవో, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకూడదు : ఎమ్మెల్యే బీవీ



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి



బోడబండలో సీసీ రోడ్డుకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు, మే 1(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో తాగునీటి సమస్య రాకూడదని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీ, హౌసింగ్ అధికారులసమావేశం నిర్వహించారు. గోనెగండ్ల, నందవరం, ఎమ్మిగనూరు మండలాల్లో అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించి, నిలిచిపోయిన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. తాగునీటి సమస్యపై నిర్లక్ష్యం చేయద్దని సూచించారు. సమా వేశంలో డీపీఓ భాస్కర్, డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, డీఎల్‌పీఓ నూర్జాహన్, డీఈలు చంద్రశేఖర్, విద్యాసాగర్, ప్రసాద్, ఏఈ శంకర్, ఎంపీడీఓ బంగారమ్మ, ఈఓపీఆర్డీలు, ఆయా శాఖలఅధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వంతోనే నైపుణ్యాభివృద్ధి సాధ్యం :

వైసీపీ ప్రభుత్వం యువకులను, మహిళలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఎమ్మెల్యే దుయ్యబట్టారు. గురువారం పట్టణంలోని ఓపెన్ ఎయిర్ థియోటర్‌లో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణాకేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, డీపీఓ భాస్కర్, డీఎల్ పీఓ నూర్జహాన్, ఎంపీడీఓ బంగారమ్మ, టీడీపీ నాయకులు చెన్నారెడ్డి, ఫారుక్, మండల కన్వీనర్ మల్లికార్జున, నాగరాజు, రంగన్న, నవాజ్ పాల్గొన్నారు.

అమరావతికి పునర్జీవం:

వైసీపీ ప్రభుత్వంలో జగన్ రాష్ట్రాన్ని రాజధానిలేని రాష్ట్రంగా చేసి, అమరావతిని నిర్వీర్యం చేశారని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి విమర్శించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిర్లక్ష్యానికి గురైన రాష్ట్ర రాజధాని అమరావతికి తిరిగి నిర్మించేందుకు సీఎం చంద్రబాబు నాయుడు నడుం బిగించారన్నారు. ఇందులో భాగంగానే రాజధాని అమరావతి పునర్నిర్మాణానికి ప్రధానమంత్రి మోడి రానున్నారన్నారు. ఆ కార్యక్రమానికి ఎమ్మిగనూరు నుంచి భారీగా తరలి వెళ్తున్నామన్నారు.

టీడీపీ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు :

ఎమ్మిగనూరు రూరల్: బోడబండ గ్రామంలో ఎమ్మెల్యే పింఛన్ లు పంపిణీ చేశారు. గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేను గ్రామ టీడీపీ నాయకులు గజమాలలు వేసి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి పింఛన్లను అందజేశారు. అలాగే గ్రామంలో 10లక్షల రూపాయలతో సీసీ రోడ్డుకు భూమి పూజ చేశారు. ప్రజలకు ఎలాంటి సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షులు శ్రీనివాసులు, సురేష్, అంజినయ్య, వెంకటరాముడు, తిక్కయ్య, లోకరెడ్డి, రామకృష్ణ, ఈరన్న, రవి పాల్గొన్నారు.

చంద్రబాబువి డైవర్షన్ పాలిటిక్స్

● ప్రజలను మభ్యపెడుతున్న సీఎం: ఎస్వీ మోహన్ రెడ్డి
● బుట్టా రేణుక భర్తతో కబ్జాదారులు చేరారు
● మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

ఎమ్మిగనూరు, మే1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి సీఎం చంద్రబాబు నాయుడు డైవర్సన్ పాలిటిక్స్ చేస్తు ప్రజలను మభ్యపెడుతున్నాడని వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని మాచాని సోమప్ప మోమోరియల్ హాల్‌లో వైసీపీ నియోజకవర్గం ఆత్మీయ సమావేశం ఆ పార్టీ ఇన్‌చార్జి బుట్టా రేణుక ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశానికి మాజీ ఎమ్మెల్యే చెన్నకేశరెడ్డి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి, మాజీ వీరశైవలింగాయత్ కార్పొరేషన్ అధ్యక్షుడు వై రుద్రగౌడ్, జిల్లా నాయకులు తెర్నేకల్ సురేంద్రరెడ్డి, బుట్టా నీలకంఠ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన పదినెలల కాలంలో పింఛన్ తప్ప మరే పథకాలు అమలు చేయలేదని ఆరోపించారు. ఇన్‌చార్జి బుట్టా రేణుక మాట్లాడుతూ పేదప్రజలకు అండగా జగన్ నిలిచారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ప్రజలకు ఎలాంటి సంక్షేమ పథకాలు ఇవ్వకుండా ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే చెన్నకేశరెడ్డి మాట్లాడుతూ బుట్టా రేణుకను ఎమ్మిగనూరు ఇన్‌చార్జీగా జగన్ నియమించారని, అందుకు అనుగుణంగా తాము పనిచేస్తున్నామని అన్నారు. అయితే కొంతమంది బుట్టా రేణుక భర్త బుట్టా నీలకంఠ వెంట భూకబ్జాదారులు చేరి తమ కుటుంబాల మధ్య విభేదాలు సృష్టిస్తున్నారని అనడంతో పార్టీ నాయకులు విస్మయానికి గురయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల్లో విశ్వసనీయత కోల్పోయిందని, ఈసారి కలిసికట్టుగా పని చేసి వైసీపీని తిరిగి అధికారంలోకి తెస్తామని ఆయన తెలిపారు. సమావేశంలో నాయకులు మున్సిపల్ చైర్మన్ రఘు, నాయకులు నాగేశప్ప, బీఆర్ బసిరెడ్డి, బుట్టా ప్రతూల్, భీమిరెడ్డి, శివారెడ్డి గౌడ్, రంగయ్య, రియాజ్, నాగేష్ నాయుడు, బందేనవాజ్, విరుపాక్షి రెడ్డి, సునీల్ కుమార్, గిడ్డయ్య, విశ్వనాథ్ రమేష్, విశ్వనాథ్‌లు పాల్గొన్నారు.

వాడవాడలా... మేడే ఉత్సవాలు



కోసిగిలో జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



ఎమ్మిగనూరులో ర్యాలీ..



మంత్రాలయంలో..

ఎమ్మిగనూరు టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మిగనూరు పట్టణంలో వామపక్షాల పార్టీల అధ్వర్యంలో మే డే దినోత్సవంను ఘనంగా నిర్వహించారు సీపీఎం, సీఐటీయూ, రైతు కూలి సంఘం, పీవైఎల్ అధ్వర్యంలో 139వ మే డే ఘనంగా న్విహించి, మున్సిపల్ ఆఫీస్ ముందు సిఐటీయూ పార్టీ జెండా అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాముడు, ఎసేపు, చిన్ని ప్రసాద్ గోవిందు, రామాంజనేయులు పాల్గోన్నారు.

కోసిగి: మండల కేంద్రమైన కోసిగిలో గురువారం ఘనంగా మేడే వేడుకలు నిర్వహించారు. కోసిగి వాల్మీకి సర్కిల్, ఆర్టీసీ బస్టాండు ప్రాంతాల్లో సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో మే డే వేడుకలను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కే.లింగన్న సీఐటీయు జెండాను ఎగురవేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐటీయూసీ జెండాను రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య ఆవిష్కరించారు. ఏఐవైఎఫ్ నాయకులు రాజు, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఈరేష్ ఆధ్వర్యంలో కోసిగిలో ఉపాధి శ్రామికులతో కలిసి మేడే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాముడు, వీరేష్, సీపీఐ మండల కార్యదర్శి గోపాల్, ఓంకార్ స్వామి, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు హెబ్సిబారాణి, లూసమ్మ, ఆశా వర్కర్లు సుజాత తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం: మండంలో 139వ మే-డే వేడుకలను వామపక్ష పార్టీలు గురువారం ఘనంగా నిర్వహించాయి. కౌతాళంలో ఐఎఫ్‌టీయూ నాయకులు, సీపీఎం పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. సీపీఎం పార్టీ కార్యాలయం వద్ద పార్టీల జెండాలను ఎగరవేసి మే-డే అవశ్యకతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వామపక్ష నాయకులు మల్లయ్య, ఈరన్న, నాగరాజు, పవన్, హనుమంతు, రామలింగ, నారాయణ, వీరేష్‌లు పాల్గొన్నారు.

మంత్రాలయం: మంత్రాలయంలో మేడే ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. గురువారం రాఘవేంద్ర సర్కిల్‌లో 139వ మేడే ఉత్సవాల్లో భాగంగా ఏఐటీయూసీ, సీపీఎం, సీపీఐ నాయకులు వేరువేరుగా జెండాలు ఆవిష్కరించి నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, మండల కార్యదర్శి మాబుసాబ్, సీపీఎం మండల కార్యదర్శి జయరాజు, అనిల్, ప్రాణేష్ కోరారు. ఏఐవైఎఫ్ నాయకులు రాజు, అబ్దుల్, హనీఫ్, లక్ష్మన్న, కాశీం, శీనప్ప, కుబేర్, ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడుబూరు: పెద్దకడబూరులోని వేర్వేరు చోట్ల సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం సీపీఎం నాయకులు తిక్కన్న, పరమేష్, సీపీఐ నాయకులు వీరేష్, మబ్బు ఆంజనేయులు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేశారు.



కౌతాళంలో..

కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు జయరాము, దుబ్బన్న, శంకర్, అంగన్వాడీ వర్కర్‌లు పాల్గొన్నారు.

● కార్మికులు ఐక్యత చాటాలని అని ఏఐటీయూసి జిల్లా కార్యదర్శి గిడ్డయ్య తెలిపారు. గురువారం పట్టణంలోని సీపీఐ కార్యలయంలో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఏఐటీయూసి ఆధ్వర్యంలో పట్టణ పురవీధుల గుండా భారీ బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, వేంకటేష్, ప్రసన్న రాజు, విజేంద్ర, దాదావలి, నరసింహులు, గోపాల్, రవి పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం 139వ మేడే ఉత్సవాలు పలు ప్రజా సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన గోనెగండ్లలో సీఐటీయూ నాయకులు అబ్దుల్లా, కరుణాకర్ మేడే జెండాను అవిష్కరించారు. గోనెగండ్ల గ్రామంతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో మేడే ఉత్సవాలను సీపీఎం పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్, సీఐటీయూ నాయకులు బతకన్న, కృష్ణ, ఆశవర్కర్లు, డప్పు కళాకారుల సంఘం నాయకులు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

● అలువాల గ్రామంలో సీపీఐ, ఏఐటీయూసి ఆధ్వర్యంలో గురువారం 139వ మేడే దినోత్సవం ను ఘనంగా జరుపుకున్నారు. సీపీఐ కార్యదర్శి నాగప్ప పతాక అవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గోపాల్, నసింహులు, హసన్, ఈరన్న, హనుమంతు కార్మికులు పాల్గొన్నారు.

నందవరం: మండల కేంద్రమైన నందవరం తో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం 139వ మేడే ఉత్సవాలు పలు ప్రజా సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్న గౌడ్ మేడే జెండాను అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముని రామలింగడు, తిమ్మప్ప, గిడ్డయ్య, శాంతప్ప, రాముడు పాల్గొన్నారు.



నందవరంలో..



గోనెగండ్లలో..



పెద్దకడుబూరులో..

మంత్రాలయానికి పోటెత్తిన భక్తులు



భక్తులతో కిటకిటలాడుతున్న శ్రీమఠం ప్రాంగణం

మంత్రాలయం, మే 1(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన లక్షలాది మంది భక్తులతో మంత్రాలయం మార్మోగింది. మే 1న సెలవు దినం, రాఘవేంద్రస్వామికి ఇష్టమైన గురువారం శుభదినం కావటంతో దక్షణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహరాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలిరావడంతో ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్, పోలీసులు, సెక్యూరిటీ ఆధ్వర్యంలో శ్రీమఠం ప్రాంగణంలో క్యూలైన్లు అదనంగా ఏర్పాటుచేశారు. ప్రసాదాల కొరత రాకుండా ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్ ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ప్రాంగణంలో నలుదిక్కులూ పీఠాధిపతి ఆదేశాల మేరకు తొక్కిసలాట జరగకుండా జాగ్రత్తలు తీసుకన్నారు. మంత్రాలయంలోని పురవీధులు, నదితీరం భక్తులతో పులకరించి పోయింది.

రాఘవరాయడికి స్వర్ణ కవచ సమర్పణ సేవ:

వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవ్రేంద స్వామి మూల బృందావనానికి బంగారు కవచ సమర్పణ సేవ రమణీయంగా చేశారు. వైశాఖ గురువారం చవితి శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో మఠం పండితులు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగుళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో చూడ ముచ్చటగా అలంకరించారు. ఇది భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. పీఠాధిపతి హస్తోదకం చేసి మహామంగళహారతులు ఇచ్చారు.

ధార్మిక పర్యటనకు వెళ్లిన పీఠాధిపతి :

మంత్రాలయ పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ధార్మిక పర్యటనలో భాగంగా తన శిష్యబృందంతో కలసి కర్ణాటకలోని ఉడిపికి వెళ్లారు. అక్కడ జరిగే సుధా మంగళ మహోత్సవంలో పాల్గొని, సంస్థాన పూజలుచేసి అక్కడి భక్తులను ఆశీర్వదించనున్నారు పర్యటన ముగించుకొని మే 3వ తేదిన శనివారం మంత్రాలయం కు చేరుకుంటారని మఠం ఏఏఓ మాధవశెట్టి, మఠం మేనేజర్ వెంకటేష్ జోషి లు తెలిపారు.

● మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ఎమ్మిగనూరు డిఎస్పీ ఉపేంద్రబాబు సతీసమేతంగా గురువారం రాత్రి రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. ఆయన వెంట సీఐ రామాంజులు,ఎస్ఐ శివాంజల్, వ్యాసరాజాచార్, జయతీర్థ ఆచార్, రంగస్వామి పాల్గొన్నారు.

మోడల్ ప్రవేశ పరీక్షలో
మండల టాపర్‌గా అఖిల

కోసిగి, మే 1 (ఆంధ్రజ్యోతి): ఏపీ మోడల్ స్కూల్ 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో మండల టాపర్‌గా జంపాపురం గ్రామానికి చెందిన కురువ అఖిల 68 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిందని ప్రిన్సిపాల్ సమీరారెడ్డి తెలిపారు. గురువారం 6వ తరగతి పరీక్ష ఫలితాలు విడుదల అయినట్లు తెలిపారు. 149 మంది పరీక్షకు అప్లయ్ చేసుకోగా.. 7 మంది గైర్హాజరయ్యారనీ, 68 మంది పరీక్షలో ఉత్తీర్ణత సాదించారనీ తెలిపారు. వినోద్ కుమార్, లక్ష్మీకాంతరెడ్డి 65 మార్కు లు సాధించి ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు. ఓసీ, బీసీలు 35 మార్కులు సాదించిన వారు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 30మార్కులు సాధించిన వారు ఒరిజినల్ టీసీ, క్యాస్ట్ ఇన్‌కం, ఆదార్‌కార్డుతో మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో చేరవచ్చని ప్రిన్సిపాల్ సమీరారెడ్డి తెలిపారు.

హోరాహోరీగా
గిరక లాగుడు పోటీలు

ఎమ్మిగనూరు, మే1(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలుగొట్లలో వెలసిన దుర్గమ్మవ్వ దేవర సందర్భంగా నిర్వహించిన బండి గిరక లాగుడు పోటీలు హోరా హోరీగా సాగాయి. గ్రామానికి చెందిన రైతు మాచాపురం నరసింహులు, మద్దిలేటి ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచి రూ. 10వేలు బహుమతి, ద్వితీయ స్థానంలో హనుమంతరాయుడు వృషభాలు రూ. 8వేలు, మూడో స్థానంలో హాసిన్ ఎద్దులు రూ.6వేలు, నాలుగో స్థానంలో నాగలాపురం లక్ష్మన్న ఎద్దులు రూ.4వేలు, ఐదో స్థానంలో కె.నాగలాపురానికి చెందిన గోవిందు ఎద్దులు రూ.2500 గెలుచుకున్నాయి. మొదటి బహుమతిని బురుజు కోట రామలింగప్ప అందజేయగా, ద్వితీయ బహుమతిని సర్పంచ్ భర్త అబ్రహాం, మూడో బహుమతిని గొల్ల పాండురంగడు, నాలుగో బహుమతిని శ్రీనివాసరెడ్డి, ఐదో బహుమతిని గొల్ల శ్రీరాములు అందజేశారు.

గోశాలకు విరాళం

కౌతాళం, మే 1(ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం వద్ద ఉన్న గోశాల అభివృద్ధికి మంగళవారం ఓ భక్తుడు రూ.50వేల నగదును విరాళంగా అందజేశారు. ఆలయ ఈఓ విజయరాజు విలేకరులతో మాట్లాడుతూ ఆలయంలోని గోశాలకు గోసంరక్షణ కోసం డోన్ పట్టణానికి చెందిన లక్ష్మీనారాయణ గుప్తా, నిర్మల కుటుంబ సభ్యులు రూ.50వేల నగదును దేవస్థానం కార్యాలయంలో అందజేసినట్లు తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. వీరి వెంట ఆలయ అర్చకులు ప్రకాష్ స్వామి ఉన్నారు.